# జనబలం

ప్రజలే ప్రభువులు

ఆగస్టు 2026 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




## మెరుగైన విద్య, స్టెమ్ కెరీర్‌ల కోసం
## FDR 'విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్'

లోక్‌సత్తా 30 YEARS 1997-2026

సుదీర్ఘ ప్రయాణం..సుస్థిర లక్ష్యం

## 100% ఈవీలకు మళ్లుదాం

## చిన్న పట్టణాలే భారత్‌కి పెద్దపరిష్కారం

- ఎన్నికల సంస్కరణలు
- సమాచార హక్కు చట్టం
- అవినీతి వ్యతిరేక ఉద్యమం
- చట్టబద్ధపాలన
- గ్రామస్వరాజ్యం/ స్థానిక ప్రభుత్వాలు







# భారత రాజకీయాలపై ఎన్‌టీఆర్ దీర్ఘకాలిక ప్రభావంపై అధ్యయనం జరగాలి: జేపీ




1983లో భారతదేశానికి, 2026లో భారత్‌కి ఎంతో తేడా ఉందని; 1980లో తెలుగువారి గుర్తింపుకి, 2026లో గుర్తింపుకి చాలా అంతరం ఉందని.. ఇందుకు మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి రామారావు ప్రభావం కీలక కారణమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ దేశంలో ఫెడరలిజం కాశ్మీర్ దాకా బలంగా వేళ్లూనుకుని రాష్ట్రాలు సొంత కార్యక్రమాలు నిర్వహించుకోగలిగే స్థాయికి ఎదగటానికి రామారావు చొరవే కారణమన్నారు. తాను ఐఏఎస్‌కి ఎంపికై ముస్సోరిలో శిక్షణ పొందుతున్నప్పుడు, ఆంధ్రప్రదేశ్‌లో ఏ భాష మాట్లాడతారని యూపీకి చెందిన ఓ సహచరుడు వ్యంగ్యంగా అడిగారని.. 1983 తర్వాత తెలుగువారి గురించి ఆ ప్రశ్న అడిగే సాహసం, అవసరం ఏ ఒక్కరికీ లేదని, అందుకు ఎన్‌టీఆర్ కృషే కారణమన్నారు.

హైదరాబాద్‌లో జరిగిన ఎన్‌టీఆర్ లిటరేచర్ కమిటీ నాలుగవ వార్షికోత్సవంలో జేపీ ప్రసంగించారు. తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, నందమూరి రామకృష్ణ, నిర్మాతలు కె.ఎస్ రామారావు, కైకాల నాగేశ్వరరావు, చదలవాడ శ్రీనివాసరావు, ప్రసన్న కుమార్, డీవీకే రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల డబ్బును సొంత డబ్బులా దుర్వినియోగం చేసే నేటి నాయకులతోపాటు అధికారులకు కూడా రామారావు ప్రజాజీవితం ఒక పెద్ద పాఠమని జేపీ అన్నారు. జనం పన్నుల డబ్బు ప్రతి రూపాయినీ ఆచితూచి ఎన్‌టీఆర్ ఖర్చు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా పాత కారును మరమ్మతు చేసి కొనసాగించటమే కాకుండా, ప్రతిపక్ష నేతగా కూడా ప్రభుత్వ వాహనాన్ని వినియోగించని క్రమశిక్షణను పాటించారన్నారు. రాజులా బతికిన ఓ సినిమా సూపర్‌స్టార్.. అలా ప్రజల కోసం నిరాడంబరత పాటించటం అరుదైన విషయమన్నారు. ఎన్‌టీఆర్ ఆర్థిక క్రమశిక్షణ, సంక్షేమానికి-అభివృద్ధికి ఆయన పాటించిన సమతూకం ఈవేళ్టి రాజకీయానికి ఎంతో అవసరమన్నారు.  కష్టం నుంచి ఎదిగినవ్యక్తిగా, సామాన్య ప్రజల పట్ల అపార ఆర్తిని కనబరిచారన్నారు. ప్రభుత్వ నియంత్రణను, సంక్షేమాన్ని అమలు చేస్తూనే.. స్వేచ్ఛా వాణిజ్యాన్ని, ప్రతిభను ప్రోత్సహించి సామాన్య ప్రజల ఆదాయాల్ని పెంచేందుకు ప్రయత్నించారన్నారు. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా వెనుకబడిన, బడుగు, బలహీన వర్గాలకు ఎన్నికల్లో టికెట్లిచ్చారన్నారు. సంపన్నుల రాజకీయాన్ని సామాన్యుల రాజకీయంగా మార్చి.. మాస్ పాలిటిక్స్‌కి దేశంలో నాంది పలికారన్నారు. ఈవేళున్న అనేకమంది నాయకులు ఎన్‌టీఆర్ వల్లే రాజకీయాల్లోకి రాగలిగారని, అనామక స్థితి నుండి అత్యున్నత గుర్తింపు స్థాయికి ఎదగగలిగారన్నారు. దేశంలోనే మహిళలను ఉద్దేశించి ప్రత్యేకంగా మాట్లాడిన తొలి రాజకీయ నేత ఎన్‌టీఆర్ అన్నారు. వారి కోసం ఆస్తిలో సమానహక్కు వంటి చట్టాల్ని నిబద్ధతతో అమలు చేశారన్నారు.

2026లోలాగే ఎన్‌టీఆర్ హయాంలో ఓసారి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో తుంగభద్ర నీటిపై కర్ణాటక ముఖ్యమంత్రి దేవెగౌడ రెచ్చగొట్టే ధోరణితో, సంకుచితంగా వ్యవహరించినా రామారావు.. మనమంతా ఒకే దేశం, తర్వాతే రాష్ట్రం అన్నట్లు వ్యవహరించారని జేపీ తెలిపారు. ఎన్‌టీఆర్ జాతీయ భావాలున్న ప్రాంతీయ పార్టీ నాయకుడన్నారు. మనిషి నిన్న పోతే ఈవేళ పట్టించుకోని సమాజంలో నాలుగు దశాబ్దాల తర్వాత కూడా రామారావు పట్ల అంతే ఆర్తితో ఆయన ప్రచురణల్ని అందిస్తూ కృషి చేస్తున్నందుకు జనార్దన్‌ను అభినందించారు.  భారతదేశంపై ఎన్‌టీఆర్ దీర్ఘకాల రాజకీయ ప్రభావాన్ని విశ్లేషకులు పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించదని, ఆ ప్రయత్నం ఇప్పటికైనా మొదలవ్వాలని అన్నారు. కులం, మతం, ప్రాంతం, డబ్బు, లింగ వివక్ష లేకుండా ఈ దేశంలో ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను అందించటమే ఎన్‌టీఆర్‌కి నిజమైన నివాళి, ఆయన అసంపూర్ణ కృషిని కొనసాగించటమవుతుందని జేపీ పేర్కొన్నారు.

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ప్రజలే ప్రభువులు

ఆగస్టు 2026

సంపుటి 28 సంచిక 08


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్




06 సైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కావాలి

08 రాష్ట్రాల ఆర్థిక క్రమశిక్షణే భారత్ సుస్థిర వృద్ధికి కీలకం

10 చిన్న పట్టణాలే భారత్‌కి పెద్ద పరిష్కారం

13 చమురు దిగుమతుల పాఠం - 100% ఈవీలకు మళ్లుదాం

16 నిస్సందేహంగా మంచి విజయాలు సాధించాం..

18 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మూడు దశాబ్దాల ప్రస్థానం

24 ప్రజలే ప్రభువులుగా..!

33 సీజేఐ కామెంట్ నుండి విద్యామంత్రి రాజీనామా దాకా



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజిగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# నిరంకుశ అధికార యంత్రాంగంపై పౌరసమాజ ఆగ్రహమే లోక్‌సత్తా!

సరిగ్గా ముప్పై ఏళ్ల క్రితం 1997 ఆగస్ట్ 3వ తేదీన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆవిర్భవించింది. స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా బ్రిటిష్ కాలంనాటి నిరంకుశ మనస్తత్వంతో పాలన సాగిస్తున్న అధికార యంత్రాంగంపై ఇది ఒక నిశ్శబ్ద విప్లవం అని చెప్పాలి.

నీతి నిజాయితీలతో, నిబద్ధతతో సేవలు అందించి సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారిగా ప్రజల్లో ఎంతో గౌరవం పొందిన డాక్టర్ ఎన్.జయప్రకాశ్ నారాయణ్ తన ఉన్నతోద్యోగానికి రాజీనామా చేశారు. ప్రజలే ప్రభువులు – పాలకులు సేవకులు నినాదంతో ఒక పౌరసమాజ ఉద్యమ సంస్థగా లోక్‌సత్తాను ఏర్పాటు చేశారు.

మురికిగా మారిన రాజకీయాలను నిందించడం వల్ల, నిరంకుశ అధికార యంత్రాంగాన్ని తిట్టుకోవడం వల్ల ప్రయోజనం లేదని, ప్రజాస్వామ్య లోపాలకు నియంతృత్వం, సైనిక పాలన, ప్రత్యామ్నాయాలు కావని లోక్‌సత్తా ఏర్పాటు దశలోనే ఆయన స్పష్టం చేశారు.

ఉద్యమాలు అనేవి సమస్యలో భాగం కాకుండా.. పరిష్కారంలో భాగం కావాలనే ఒక భిన్నమైన భావజాలాన్ని లోక్‌సత్తా ప్రతిపాదించింది. కేవలం విమర్శలతో, నిరసనలతో, ఉద్యమాలతో సరిపెట్టుకోవడం కాకుండా మౌలిక మార్పులు తేవడానికి కావాల్సిన రాజకీయ, పరిపాలనా సంస్కరణల అవసరాన్ని బహిరంగ చర్చలో భాగం చేయడానికి లోక్‌సత్తా ప్రాధాన్యం ఇచ్చింది. రాజకీయ సంస్కృతిలో మార్పులు తేవాల్సిన అనివార్యతను పౌరసమాజం దృష్టికి తెచ్చింది.

ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల్లో ఒక పార్టీ ప్రభుత్వం స్థానంలో.. మరో పార్టీ, ప్రభుత్వం ఏర్పడ్డం వల్ల మార్పులు రావని, ఆటగాళ్లను మార్చడం వల్ల ప్రయోజనం లేదని, ఆట నియమాలను మార్చాలని లోక్‌సత్తా నొక్కి చెప్పింది. రాజకీయ, పాలనాపరమైన అవినీతి అనేది ఒక లక్షణం మాత్రమేననీ, పాలనా వ్యవస్థలోని అన్ని రుగ్మతలకు మూలం అవినీతితో ముడిపడిన ఎన్నికల విధానంలో ఉందని లోక్‌సత్తా స్పష్టంగా చెబుతూ వచ్చింది.

నిరంకుశ పాలనా వ్యవస్థ ప్రక్షాళన బ్యాలెట్ బాక్స్ దగ్గరే మొదలు కావాలని లోక్‌సత్తా నినదించింది. దీనిపై సుప్రీంకోర్టులో సుదీర్ఘమైన న్యాయపోరాటం సాగించింది. ఫలితంగానే అభ్యర్థుల నేర చరిత్ర, ఆస్తులు,అప్పులు, విద్యార్హతలు వంటి వివరాలు అఫిడవిట్ రూపంలో ప్రకటించడం తప్పనిసరి అయ్యింది. అంతమాత్రాన ఎన్నికల వ్యవస్థ సులభంగా మారిపోతుందని లోక్‌సత్తా ఎన్నడూ అనుకోలేదు.

ధనబలం, కండబలం లేని, కుల మత ప్రాంతీయ భావోద్వేగాలకు అతీతమైన ఎన్నికలు జరిగినప్పుడే అసలైన మార్పు సాధ్యమవుతుందనే బలమైన సిద్ధాంతంతో ‘లోక్‌సత్తా’ ఉద్యమం నడిచింది. దామాషా ప్రాతినిధ్య ఎన్నికల పద్ధతి అమలులోకి వస్తే పార్టీల రాజకీయ విధానాలు, మ్యానిఫెస్టోలపై ఆధారపడి ప్రజలు ఓట్లు వేసే అవకాశం ఏర్పడుతుందనీ, పోలయిన ప్రతి ఓటుకు ప్రాతినిధ్యం లభించే దామాషా ప్రాతినిధ్య విధానమే ఉన్నంతలో మేలైనదని లోక్‌సత్తా ప్రతిపాదించింది. రాజ్యాంగ సవరణ అవసరం లేకుండానే చట్ట సవరణతో ఎన్నికల విధానాన్ని మార్చే మార్గాన్ని లోక్‌సత్తా చూపించింది. ఈ ప్రతిపాదనకు ఆనాటి ప్రధాన రాజకీయ పక్షాలలో సూత్రప్రాయమైన ఏకీభావం వ్యక్తం అయ్యింది. అయితే మార్పునకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధం అయినా అధికారంలో ఉన్న పార్టీ మాత్రం సిద్ధం కాలేదు. ప్రస్తుత ఎన్నికల పద్ధతిలో తమకు లభిస్తున్న ఏకఛత్రాధిపత్యం పోతుందన్నదే వారి భావన. అన్ని అధికార పార్టీల ఆలోచన ఒకే రకంగా ఉంటుందని దేశంలోని పలు పార్టీలు రుజువు చేశాయి.

పాలనా సంస్కరణల విషయానికి వస్తే పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం లోక్‌సత్తా కేంద్రీకరించి కృషి చేసింది. బ్రిటిష్ కాలం నాటి అధికార రహస్యాల చట్టం కఠోర నియమాల నుండి పౌరులకు ఉపశమనం కల్పించడానికి 2005 నాటి సమాచార హక్కు చట్టం తీసుకు రావడంలో లోక్‌సత్తా నిర్ణయాత్మక పాత్ర పోషించింది. వివిధ ప్రభుత్వ శాఖలలో సిటిజన్ చార్టర్లను ప్రవేశపెట్టడం ద్వారా పౌర సేవలను మెరుగుపరిచేందుకు లోక్‌సత్తా పోరాడి సాధించింది.

మంత్రివర్గ సభ్యుల సంఖ్యకు 15 శాతం పరిమితిని విధిస్తూ 91 వ రాజ్యాంగ సవరణ తీసుకురావడంలో లోక్‌సత్తా పాత్ర ముఖ్యమైనది. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పటిష్టం చేయడం, రాజకీయ పార్టీలకు ఎన్నికల నిధులు, వాటి చెల్లింపుల పారదర్శకత, వంటి చట్టాల విషయంలో లోక్‌సత్తా చేసిన ప్రయత్నం ఫలించింది. అధికార వికేంద్రీకరణలో భాగంగా స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు, విధులు, సిబ్బందిని కేటాయించి గ్రామ రిపబ్లిక్‌ల ఏర్పాటు

చేయడం ద్వారా స్థానిక ప్రభుత్వాల సాధికారత కల్పించాలని లోక్‌సత్తా సాగించిన పోరాటం చారిత్రాత్మకమైనది. విద్య, వైద్య రంగాలలో ప్రమాణాల పెంపుదలకు లోక్‌సత్తా పలు ఆచరణాత్మక ప్రతిపాదనలను చేసింది.

న్యాయమూర్తుల నియామకం కోసం జ్యుడిషియల్ అపాయింట్‌మెంట్ కమీషన్ నుండి సత్వర న్యాయం కోసం గ్రామ న్యాయాలయాల స్థాపన వరకూ పలు న్యాయ సంస్కరణల కోసం లోక్‌సత్తా సాగించిన కృషి చిన్నదేమీ కాదు. గడిచిన మూడు దశాబ్దాలలో, ఆధునిక భారత ప్రభుత్వ విధానాల రూపకల్పనలో లోక్‌సత్తా అత్యంత ప్రభావవంతమైన శక్తిగా పనిచేసింది. ఉన్నతస్థాయిలో మేధోపరమైన ఒత్తిడిని ప్రయోగిస్తూనే దానికి సామాన్యుల భాగస్వామ్యాన్ని మేళవించడం ద్వారా దేశ చరిత్రలోనే అత్యంత కీలకమైన అవినీతి నిరోధక, ఎన్నికల, పరిపాలనా సంస్కరణల చట్టాలను లోక్‌సత్తా సంస్థ నిశ్శబ్దంగా సాధించి చూపించింది. రాజకీయాలను అసహ్యించుకుంటూ, నియంతృత్వమే మేలనుకునే లక్షలాది మంది యువతను రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య రాజకీయాల వైపు, పాలనా సంస్కరణలవైపు లోక్‌సత్తా సమీకరించింది. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి ప్రజాస్వామ్య సంస్కరణల భావజాలం ఒక ఆయుధంగా వినియోగపడుతుందని గత మూడు దశాబ్దాల లోక్‌సత్తా ప్రస్థానం రుజువు చేసింది.

ఇటీవల సమస్యల పరిష్కారం కోరుతూ జెన్ జీ యువత రోడ్లెక్కడాన్ని చూస్తున్నాం! లక్షలాది మంది యువత పూజ్య బాపూజీ, డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలతో, భారత రాజ్యాంగం ప్రతిని చూపుతూ శాంతియుత నిరసనలకు పూనుకున్న యువతను చూస్తుంటే ఒకప్పుడు ఇవే ప్రతీకలతో ప్రజాస్వామ్య సంస్కరణల కోసం లోక్‌సత్తా ప్రారంభించిన ఉద్యమం గుర్తుకు రావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అయితే లోక్‌సత్తాకు లభించిన పరిణితి కలిగిన అనుభవ పూర్వక నాయకత్వం ఈ జెన్ జీ ఉద్యమానికి లేకపోవడం పెద్ద లోటని చెప్పాలి. ఇలాంటి ఉద్యమాలనుండే దేశానికి నాయకత్వం లభించిందన్న వాస్తవాన్ని కూడా గుర్తుంచుకోవాలి. యువతను కలవర పరుస్తున్న సమస్యలు, వారి ఆవేదనలు, ఆకాంక్షలు, సానుభూతితో అర్థం చేసుకోవాల్సి ఉంది. జెన్ జీ యువతతో నిరంతరం సంభాషించడం, వారికి ప్రజా స్వామ్యం, చట్టబద్ధ పాలన, పారదర్శకత, జవాబుదారీతనం వంటి విలువలను అవగతం చేయడం, లోక్‌సత్తా సాగించిన కృషి గురించి వివరించడం అవసరం.

డి. సోము సుందర్

## జనబలం చందాదారులు, పాఠకులకు ముఖ్య గమనిక !

క్షేత్రస్థాయి నుండి రాష్ట్ర స్థాయి దాకా జరిగే లోక్‌సత్తా ఉద్యమ కార్యక్రమాలను సభ్యులకి చేరవేసే ఒక న్యూస్ లెటర్ గా "జనబలం" పత్రిక 29 ఏళ్ల క్రితం మొదలయింది. నలుపు తెలుపు రంగుల్లో ఒక చిన్న న్యూస్ లెటర్‌గా ప్రారంభమైన జనబలం, లోక్ సత్తా ఉద్యమంతో పాటే ఎదిగింది. న్యూస్ లెటర్ దశ నుండి లోక్‌సత్తా భావజాల వ్యాప్తికి ఒక బలమైన మాధ్యమంగా, ఒక పూర్తి స్థాయి మాసపత్రికగా రూపుదిద్దుకుంది. వేలాదిమంది కార్యకర్తలకు కార్యాచరణలో కరదీపికగా మార్గదర్శనం చేసింది. ఒకానొక దశలో చందాదారుల సంఖ్య 35వేలు దాటింది. లోక్ సత్తా సభ్యులే కాకుండా, సమాజహితం కోరే ఎంతోమంది "జనబలం" ను ఆదరించారు. కొన్నాళ్ళ పాటు చందాదారులకే కాక, బహిరంగ మార్కెట్ లోను జనబలం పత్రిక పంపిణీ జరిగింది. లోక్ సత్తా కార్యకర్తలే కాకుండా మరెంతో మంది రచయితలు, కార్టూనిస్ట్ లు జనబలం ద్వారా ప్రజల్లో రాజ్యాంగం పట్ల, చట్టాల పట్ల అవగాహన పెంచే ప్రయత్నం చేసారు. లోక్ సత్తా ఉద్యమం ప్రారంభమై 2026 ఆగస్టుకు ముప్పై ఏళ్ళు పూర్తి అవుతున్నది.

ఇప్పుడు కాలం మారుతోంది. డిజిటల్ మీడియా యుగం నడుస్తోంది. పెద్ద పెద్ద దిన పత్రికలు కూడా వెబ్ ఎడిషన్స్ పైనే దృష్టి పెడుతున్నాయి. PDF కాపీలు మాత్రమే వాట్సాప్ ద్వారా పంపిణీ చేసే పత్రికలు కూడా ప్రజల ఆదరణ పొందుతున్నాయి. పాఠకులకు కూడా ఈ డిజిటల్ పత్రికలు చాలా సౌకర్యవంతంగా ఉన్నాయి. సమయం చిక్కినప్పుడు మొబైల్ ఫోన్‌లో చదువుకోవడానికి, మిత్రులతో షేర్ చేసుకోవడానికి ఇవి అనువుగా ఉన్నాయి. మరోవైపు పత్రిక ముద్రణ, పంపిణీ కూడా కష్టంగా మారుతోంది. అంతే కాకుండా ఇటీవల యూట్యూబ్ ద్వారా సమకాలీన పరిణామాలపై, లోక్ సత్తా అజెండాపై డా.జయప్రకాష్ నారాయణ్‌గారి వీడియో సందేశాలను, ప్రసంగాలను, ఇంటర్వ్యూలను ఎప్పటికప్పుడు అప్ లోడ్ చేస్తున్న సంగతి కూడా లోక్ సత్తా మిత్రులు గమనించే ఉంటారు.

ఈ నేపథ్యంలో పత్రికా సంపాదకవర్గం, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ గారితో సంప్రదించి, ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు సంచిక మాత్రమే ముద్రించిన కాపీలు పోస్ట్ ద్వారా పంపిణీ అవుతాయి. సెప్టెంబర్ 2026 సంచిక నుంచి ఆన్‌లైన్ ఎడిషన్(పీడీఎఫ్) అందుబాటులో ఉంటుంది. ప్రతీనెలా జనబలం పీడీఎఫ్ కాపీ పంపేందుకు జనబలం చందాదారులు మీ వాట్సాప్ నెంబర్, మెయిల్ ఐడీ వివరాలు లోక్‌సత్తా కార్యాలయ వాట్సాప్ నెంబర్ **9866074025** కు పంపగలరు. చందాదారులు, పాఠకులు ఈ మార్పును గమనించి ఎప్పటి మాదిరిగానే సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇట్లు
జనబలం సంపాదకవర్గం

# సైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కావాలి



✦ దాతలకు జేపీ విజ్ఞప్తి

✦ఎఫ్‌డీఆర్ 'విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్'ని ప్రారంభించిన శ్రీధర్‌బాబు, ఈటల, విజయేంద్ర ప్రసాద్..




ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటు స్కూళ్ల కన్నా ఎక్కువ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని, ఇప్పుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) అల్వాల్ జెడ్.పి (బాలికలు) హైస్కూల్‌లో ప్రారంభించిన 'విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్'లు తెలంగాణ వ్యాప్తంగా ప్రారంభమైతే విద్యాప్రమాణాలు ఫీజుల భారం లేకుండా మరింత మెరుగుపడతాయని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమల మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. సైన్స్ పట్ల భయం పోయి, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించే శక్తి వస్తే.. విద్యలో గొప్పగా రాణించవచ్చున్నారు. పరిశోధన కేవలం స్కూల్ చదువుల్లోనే ఉండదని.. ఎండ, వాన, గాలి, వంటగది.. అన్నిట్లో ఉందన్నారు. అందరికీ అన్ని సదుపాయాలూ అందించటం అసాధ్యమని మన పూర్వీకులు అనుకునేవారని, కానీ సైన్స్ వల్ల ఈవేళ అందరికీ నచ్చిన ఆహారం, అన్ని రకాల సౌకర్యాలూ అందుబాటులోకి వచ్చాయన్నారు. ఒకప్పుడు అమెరికా నుండి ఓడ వస్తే తప్ప మనదేశంలో తినటానికి ఆహారం ఉండేది కాదని, కానీ శాస్త్రవేత్తల కృషి వల్ల ఈవేళ ఎగుమతులు చేయగలుతున్నామన్నారు. అమ్మాయిల స్కూల్‌ని తమ సైన్స్ సెంటర్ ప్రారంభించటానికి జేపీ ఎంచుకోవటం అభినందనీయమన్నారు. తాను ఎక్కువగా మార్కుల కోసమే చదివానని, కానీ ఇప్పటి ఆర్థిక వ్యవస్థలో ఆ చదువు చాలదన్నారు. అంతరిక్షం వరకు సరైన లక్ష్యాలను ఏర్పరచుకుని జేపీ అందిస్తున్న ఈ బృహత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని అల్వాల్ జెడ్.పి బాలికల హైస్కూల్‌లో ఎఫ్‌డీఆర్ ఆధ్వర్యంలో 'విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్'ని శ్రీధర్ బాబు ప్రారంభించారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ సభ్యులు ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు, ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్, పారిశ్రామికవేత్త కృష్ణ ప్రసాద్, డీఈఓ రేణుకాదేవి, జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్‌డీవో శ్యాంప్రకాష్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్రపతి నిలయం మేనేజర్ రజినిప్రియ, ఎంఈవో మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు శకుంతల, ఇతర స్కూలు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. తొలుత ఎఫ్‌డీఆర్ బృందం ల్యాబ్ విశేషాలను అతిథులకు,





ఉపాధ్యాయులకు వివరించారు.

ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జేపీ మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఎదగటానికి వంద మార్గాలున్నాయని, కానీ వారిలోని మేధస్సు వికసిస్తేనే అది సాధ్యమవుతుందని అన్నారు. ఆ మేధస్సుకు అవసరమైన పాఠశాల విద్య సరిగా అందకపోవటం వల్ల తెలంగాణ సహ పలు రాష్ట్రాల్లో 80 శాతం మంది పిల్లల తెలివితేటలు వృథా అవుతున్నాయన్నారు. ప్రభుత్వాలు ఏటా ఒక్కో పాఠశాల విద్యార్థిని మీద రూ.లక్ష పైగా ఖర్చు చేస్తున్నా చదువు రావటం లేదన్నారు. విషయాన్ని అర్థం చేసుకోవటం, ఆ పరిజ్ఞానాన్ని జీవితంలో ఉపయోగించగలగటం విద్య లక్ష్యమని, అలాంటి నిజమైన విద్యకు సైన్స్ సబ్జెక్ట్ కీలకమన్నారు. అందుకోసమే బ్రిడ్జింగ్ ది గ్యాప్‌గా 'విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్'ని ప్రారంభిస్తున్నామన్నారు. సైన్స్ సక్రమంగా నేర్చుకోవటం వల్ల మిగతా సబ్జెక్టులలో కూడా అవగాహన పెరుగుతుందని, భవిష్యత్తులో కెరీర్‌కి కీలకమైన 'స్టెమ్' (సైన్స్–టెక్నాలజీ–ఇంజినీరింగ్–మ్యాథ్స్) విభాగాల్లో అద్భుతంగా రాణించగలరన్నారు. ప్రభుత్వోద్యోగాల కోసం సమయం వృథా చేసుకోకుండా, అసలైన ఉపాధి అవకాశాలున్న మార్కెట్‌లో గొప్ప అవకాశాలను అందుకోగలరన్నారు. ఎన్నిసార్లు, ఎన్నిచోట్ల విఫలమైనా.. అవకాశాలకు ముగింపు ఉండదనే ఆత్మవిశ్వాసం మంచి పాఠశాల విద్య ఉన్నవారిలోనే సాధ్యమవుతుందన్నారు. తెలుసుకోవాలనే జిజ్ఞాస, ప్రశ్నించటం, శోధించటం, బట్టీపట్టి కాగితం మీద మార్కులు కాకుండా, నిజంగా కాన్సెప్ట్‌లను అర్థం చేసుకుని ఉపయోగించటం, క్లిష్ట సమస్యలను అవకాశాలుగా మలచుకోవటం, జీవితకాల శాస్త్రీయ దృక్పథం ఇటువంటి సైన్స్ సెంటర్ల ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఈ సైన్స్ విప్లవంలో అందరూ భాగస్వాములు కావాలని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వీలైనన్నిచోట్ల స్కూళ్లలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఇటువంటి సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తాయన్నారు. ఎన్నారైలు, కాస్త వనరులున్నవారు గ్రామాలు, మండల కేంద్రాల్లో, చిన్న పట్టణాలలో ఇటువంటి సైన్స్ సెంటర్‌లను ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోవాలని, అవసరమైన సమాచారాన్ని, సాంకేతిక సంపత్తి కోసం హైదరాబాద్‌లోని ఎఫ్‌డీఆర్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు (98660 74025/www.fdrindia.org). తద్వారా లక్షలాది మంది పిల్లల భవిష్యత్తుకి తోడ్పడినవారవుతారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోను ఒక వెయ్యి (1000) ఇలాంటి విజ్ఞాన్ సేతులను ప్రారంభించాలని పిలుపునిచ్చారు.

విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, తాను రోజువారీ జీవితంలో 'డబ్ల్యూ'ని ఎక్కువ ఇష్టపడతానని, ఎందుకు, ఏమిటి తదితర అనేక మౌలిక ప్రశ్నలు అందులో ఉండటమే అందుకు కారణమన్నారు. సినిమా, సైన్స్ విడదీయలేనివన్నారు. శాస్త్రీయ దృక్పథం లేకుండా సినిమా తీయలేమన్నారు. మంచి సినిమా చాలామందికి స్ఫూర్తినిస్తుందన్నారు. విజయాన్ని, అపజయాన్నీ సహజంగా భావించి.. విద్యార్థులు థామస్ అల్వా ఎడిసన్‌లా పోరాడి గెలవగలగాలన్నారు.

విద్య మీద ఖర్చు చేసే ప్రతి రూపాయి భవిష్యత్తుకు పెట్టుబడి అని ఈటల రాజేందర్ అన్నారు. విద్యార్థులు సాంకేతికతను సానుకూలతతో సద్వినియోగం గావించుకోవాలన్నారు. విమర్శనాత్మక దృష్టి పెరిగేలా చదువుకోవాలన్నారు. పిడుగు పడితే ఆకాశం నుండి అర్జునుడి రథం సీల జారిపడిందనే రోజుల్లా ఆలోచించవద్దన్నారు. కరోనా సమయంలో వేగంగా వ్యాక్సిన్ తయారు చేసింది హైదరాబాద్ అని, అటువంటి సామర్థ్యాన్ని సైన్స్ సెంటర్ల ద్వారా పాఠశాల విద్యార్థులు నేర్చుకుంటే తెలంగాణ అన్ని రంగాల్లో వేగంగా ప్రపంచస్థాయికి ఎదుగుతుందన్నారు.

అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా అడిగిన పలు ప్రశ్నలకు పెద్దలు సమాధానం చెప్పారు. ఎటువంటి శాలువాలూ, సత్కారాలూ లేకుండా బిల్ బ్రైసన్ రాసిన 'ఎ షార్ట్ హిస్టరీ ఆఫ్ నియర్లీ ఎవ్రీథింగ్' పుస్తకాన్ని అతిథులకు పిల్లల ద్వారా జేపీ బహూకరించారు. ✢

# రాష్ట్రాల ఆర్థిక క్రమశిక్షణే భారత్ సుస్థిర వృద్ధికి కీలకం

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**



*"కేంద్ర ప్రాయోజిత పథకాలు మరీ ఎక్కువైపోయాయని.. భారత్ లాంటి సువిశాల, వైవిధ్యభరిత దేశంలో ఒకే పథ కం దేశమంతటికీ సమర్థంగా ఉపయో గపడుతుందనుకోవటం తగదని రాష్ట్రాలు చేస్తున్న ఫిర్యాదులు అర్థవంతమైనవి.*

ద్రవ్య నిర్వహణను యూనియన్ ప్రభుత్వం పుష్కర కాలంగా ప్రశంసనీయంగా నిర్వహిస్తుండటం వల్ల అంతర్జాతీయ ఒడిదుడుకుల్ని సమర్థంగా ఎదుర్కొనే ఆర్థిక సామర్థ్యం మనకు ఎలా సమకూరిందో ఇరాన్ యుద్ధం రుజువు చేసింది. కానీ, నిజమైన పరిపాలన రాష్ట్రాల్లోనే ఉంది. కాబట్టి అభివృద్ధిని వేగంగా, సుస్థిరంగా పెంచటానికి నిజమైన సవాళ్లు రాష్ట్రాల్లోనే ఎక్కువని, రాష్ట్రాల ప్రాధాన్యత రాబోయే కాలంలో ఇంకా పెరుగుతుందని పలు వ్యాసాల్లో పేర్కొన్నాను.

ఖజానాకు చేరే ప్రజాధనాన్ని ప్రభుత్వం వ్యయం చేసే తీరు వేర్వేరు అంచెల్లో, అంటే – జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో – ఎలా ఉందో ముందుగా చూద్దాం.

పరిపాలన, పౌర సేవలు అందించటంలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ రాజ్యాంగ బాధ్యతల్ని ఇచ్చారు. ఈ నేపథ్యంలో, చట్టబద్ధపాలన, మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం.. ప్రధానంగా రాష్ట్రాల విధినిర్వహణ పరిధిలోని అంశాలు. వీటికితోడు తాత్కాలిక, వ్యక్తిగత సంక్షేమ పథకాల భారీ భారాన్ని కూడా రాష్ట్రాలు తలకెత్తుకున్నాయి. వనరుల కంటే కోరికలు ఎప్పుడూ ఎక్కువగా ఉంటాయనేది ఆర్థిక శాస్త్ర మొదటి సూత్రం. ప్రభుత్వంలో వనరులకు ఎప్పుడూ పరిమితులు ఉంటాయి. మన రాజకీయంలోని విపరీత పోటీ, పార్టీలవారీగా ప్రజల్లో తీవ్ర విభజనలరీత్యా.. రాష్ట్రాలు వనరుల బదిలీ విషయంలో యూనియన్‌పై తరచూ ఫిర్యాదు చేస్తుంటాయి. జాతీయ స్థాయి ప్రభుత్వం తమ వాటాకు తగినన్ని నిధుల్ని ఇవ్వటం లేదని ఆరోపిస్తుండటం పరిపాటి. కానీ వాస్తవం గుర్తించటానికి కొంత లోతుగా చూడాలి.

యూనియన్ ప్రభుత్వానికి కూడా పలు కీలక బాధ్యతలున్నాయి. జాతీయ భద్రత, భారీ మౌలిక సదుపాయాలు, ఆహార, వ్యవసాయ సబ్సిడీలకు నిధులు కేటాయించాలి. ఇవికాక, అనేక సంక్షేమ పథకాల్నీ అమలు చేయాల్సి వస్తోంది. కానీ వనరులు మాత్రం అవే. పరిమితమైనవి.

రాజకీయంగా ఎన్ని విమర్శలు చేసుకున్నా, గత ముప్పై, నలభై ఏళ్లలో మన ఫెడరలిజం పరిణతి చెందిందనేది నిజం. సెస్సులు, అదనపు ఛార్జీలు మినహాయించి యూనియన్ ఆదాయాలన్నీ విభజిత ఆదాయమొత్తం పరిధిలోకి వస్తాయి. రాష్ట్రాలకు 42% వాటా నిధులు బదిలీ అవుతున్నాయి. అదనంగా, స్థానిక ప్రభుత్వాలకూ యూనియన్ నుంచే గణనీయ మొత్తంలో గ్రాంట్లు అందుతున్నాయి. ఇతరత్రా కొన్ని గ్రాంట్లూ ఉంటాయి. మౌలిక వసతుల కోసమని ఇటీవల వడ్డీలేని రుణాలని జాతీయ స్థాయి ప్రభుత్వం కేటాయించింది. అవి వాస్తవానికి ఉచితంగా ఇచ్చిన గ్రాంట్ల కిందే లెక్క. వీటితోపాటు, కేంద్ర ప్రాయోజిత పథకాల రూపంలో గణనీయ మొత్తాన్ని రాష్ట్రాలకు బదిలీ చేస్తుంటారు. ఈ రకంగా, మొత్తం కలిపి రూ.25.60 లక్షల కోట్లు రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో బదిలీ అయ్యాయి. యూనియన్ పన్ను ఆదాయాల్లో అది 59.93%. డివిడెండ్లు, ఇతర పన్నేతర ఆదాయాలను కలిపితే..అది మొత్తం రెవెన్యూలో 52.75%. ఇంతకంటే ఎక్కువ డబ్బును బదిలీ చేసే అవకాశం యూనియన్ ప్రభుత్వ ఖజానాకు లేదనేది సుస్పష్టం.

కేంద్ర ప్రాయోజిత పథకాలు మరీ ఎక్కువైపోయాయని.. భారత్ లాంటి సువిశాల, వైవిధ్యభరిత దేశంలో ఒకే పథకం దేశమంతటికీ సమర్థంగా ఉపయోగపడుతుందనుకోవటం తగదని రాష్ట్రాలు చేస్తున్న ఫిర్యాదులు అర్థవంతమైనవి. మనకు జాతీయస్థాయి పథకాలు చాలా తక్కువ సంఖ్యలో ఉండాలి. అవి సమగ్రంగా, పకడ్బందీగా ఉండాలి. తమకు అనువైనరీతిలో అమలుచేసుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఇవ్వాలి.

రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీలో మనం ఆయా ప్రాంతాల ఆదాయాల స్థాయిని, ఆకాంక్షల్ని పరిగణలోకి తీసుకోవాలి.

తక్కువ తలసరి ఆదాయం ఉన్న ప్రాంతాల అవసరాల్ని, మెరుగ్గా అభివృద్ధి సాధించిన రాష్ట్రాల ఆకాంక్షల్ని సమన్వయం చేయాలి. ఆర్థిక సంఘాలు ఈ విషయంలో ప్రశంసనీయంగా వ్యవహరిస్తున్నాయనటంలో సందేహం లేదు. అన్ని రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహిస్తూ, రకరకాల అభిప్రాయాల్ని సంధానిస్తున్నాయి. 16వ ఆర్థికసంఘం నివేదిక బీజేపీయేతర, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల అను మానాలు, వివాద రాజకీయాలకు అతీతంగా ఆమోదం పొందింది.

60%పైగా రాష్ట్రాల్లోనే వ్యయం.. ప్రపంచంలోనే అత్యధికం రాష్ట్రాలకు గణనీయ శాతం నిధులు బదిలీ అవుతున్న నేపథ్యంలో.. భారత్‌లో రాష్ట్రాల స్థాయి వ్యయం ప్రపంచంలోని అన్ని సమాఖ్య దేశాల్లో కంటే అత్యధికం. మన దేశంలో ప్రభుత్వాల వ్యయంలో 60% రాష్ట్రాల్లోనే జరుగుతోంది. ఇతర ఫెడరల్ దేశాలతో పోల్చి చూసుకుంటే, మనకు ఈ అంతరం స్పష్టంగా అర్థమవుతుంది. మొత్తం ప్రభుత్వ వ్యయంలో రాష్ట్రాల వాటా అమెరికాలో 40.1%, బ్రెజిల్‌లో 40.2%, ఆస్ట్రేలియాలో 40%. ఇండొనేషియాలో ఈ మొత్తం 37.9%. ఇలా అసమతూక వ్యయం వల్ల మన దేశంలో నిజమైన బాధితులు – స్థానిక ప్రభుత్వాలు. ఓఈసీడీ దేశాలనే తీసుకుంటే, మొత్తం ప్రభుత్వ వ్యయంలో స్థానిక ప్రభుత్వాలు 40% దాకా ఖర్చు చేస్తున్నాయి. నియంతృత్వ, ఏకపార్టీ దేశం చైనాలో స్థానిక ప్రభుత్వాల వాటా వింటే షాకవ్వాల్సిందే. 51%! భారత్‌లో స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేస్తున్నది, కాదు విదిలిస్తున్నది 3%. ప్రపంచంలోని ఫెడరల్ దేశాలన్నిటిలోకీ ఇది అతి తక్కువ.

ఈ గణాంకాలన్నిటినీ చూస్తే.. రాష్ట్రాలకు వనరులు ఇవ్వటం లేదనేది అవాస్తవమని స్పష్టమవుతుంది. అసలు సవాలు– ఈస్థాయికి పెరిగిన వనరుల్ని సమర్థంగా, వివేచనతో వినియోగించకపోవటం.

కొన్ని రాష్ట్రాలు అద్భుతరీతిలో ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్నాయి. ఒడిశా, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక తమ రాష్ట్ర జి.ఎస్.డి.పిలో 25% లోపే ఉండేలా ప్రభుత్వ అప్పుని కట్టడి చేస్తున్నాయి. ఒడిశా, ఉత్తంప్రదేశ్, గుజరాత్‌లకు ఆరోగ్యకరమైన రెవెన్యూ మిగులు ఉంది. మౌలిక వసతులు, ఇతర పెట్టుబడి వ్యయాలలో భారీగా పెట్టుబడీ పెడుతున్నాయి. ఆర్థిక వ్యవస్థను వేగంగా పెంచుకుంటు న్నాయి. పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌ల పెట్టుబడి వ్యయం మాత్రం 10% లోపే ఉంది. ఆదాయంలో అత్యధికం తాత్కాలిక సంక్షేమ పథకాలకు, జీతభత్యాలు వంటి తప్పనిసరి ఖర్చులకే వెచ్చిస్తున్నాయి.

ప్రభుత్వాల అప్పు కొన్ని రాష్ట్రాల్లో మితిమీరింది. మనుగడ కష్టమనే స్థాయి ప్రమాదాన్ని ఆ రాష్ట్రాలు ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల వడ్డీ భారం విపరీతమవుతోంది. ఖజానా మీద తీవ్ర ఒత్తిడి పడుతోంది. బకాయి బిల్లుల్ని కలిపి చూస్తే, ఆంధ్రప్రదేశ్ అప్పు జి.ఎస్.డి.పిలో 60%కి పైగా ఉంది. మొత్తం రెవెన్యూ వ్యయంలో 27% వడ్డీ కట్టటానికే సరిపోతోంది. తెలంగాణ, పంజాబ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాల అప్పులు జి.ఎస్.డి.పిలో 40% దాటాయి. తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. కొంత రెవెన్యూ మిగులూ ఉండేది. కానీ, ప్రభుత్వ దుబారా వ్యయం; సంక్షేమం పేరుతో మితిమీరిన పందేరాలు; భారీ, జవాబు దారీతనంలేని వ్యయంతో బడాయిప్రాజెక్టులు.. ఖర్చుకు–ఆదాయానికి పొంతనలేని పరిస్థితిని సృష్టించాయి. ప్రయో జనాలు, వాస్తవాలతో సంబంధంలేకుండా ప్రాజెక్టులకు పెద్దఎత్తున ఖర్చు చేయటంతో.. పెట్టుబడి వ్యయం కూడా ఫలితాలనివ్వకుండా ఆర్థిక నిర్వహణపై ఒత్తిడి పెరిగిపోయింది.

ప్రభుత్వాల వ్యయాన్ని అన్ని రాష్ట్రాల్లో జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు విశ్లేషిస్తుండాలని ఈ వివరాలన్నీ మనకు తెలియచేస్తున్నాయి. అప్పు– జి.ఎస్.డి.పి నిష్పత్తి, బడ్జెట్‌లో చూపని రుణాలు, పద్దుల్లో తరచుగా కనిపించకున్నా చెల్లించకతప్పని బిల్లులు, వడ్డీ భారం, జీతాలు, పెన్షన్లు, సంక్షేమం పేరుతో అమలు చేస్తున్న పథకాల వ్యయం, రెవెన్యూ లోటు, పెట్టుబడి వ్యయం (అంచనాలు, నాణ్యత ప్రాతిపదికన) -- వీటన్నిటినీ పర్యవేక్షిస్తూ ఆర్థిక ఆరోగ్యాన్ని బేరీజు వేయాలి.

అంతర్జాతీయంగా ఒడిదుడుకులు కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మరింత జాగ్రత్త అవసరం. అధిక, సుస్థిర ఆర్థికాభివృద్ధిని సాధిస్తూనే.. మరోవంక ప్రజాధనాన్ని వివేచనతో, ఆచితూచి వినియోగిస్తుండాలి. యూనియన్, కొన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణను ప్రదర్శిస్తూ మన పిల్లల భవిష్యత్తును పరిరక్షించేలా వ్యవహరిస్తున్నాయి. కానీ కొన్ని రాష్ట్రాలు ఆర్థిక అరాచకత్వంతో మన ఉమ్మడి భవిష్యత్తుని ప్రమాదంలోకి నెడుతున్నాయి. రాష్ట్రాలు దివాళా తీస్తే, మన చట్టాల ప్రకారం మొత్తం దేశం ఆ భారాన్ని మోయాల్సి ఉంటుంది. ఆర్థిక స్థిరత్వం, పరపతి అంశాలు ఏ రాష్ట్రానికా రాష్ట్రం విడిగా ఉండవు; అవి దేశం మొత్తానికి వర్తించే కీలక అంశాలు.

**మరి ఏం చేయాలి?**

రాష్ట్రాల్లో ఒడిదుడుకుల్ని, సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు, నివారించేందుకు రాజ్యాంగపరంగా బలమైన, రాజకీయంగా ఆచరణసాధ్యమైన పద్ధతులు, పరిష్కారాల గురించి ఇంకో వ్యాసంలో చర్చించుకుందాం. ✢

# చిన్న పట్టణాలే భారత్‌కి పెద్ద పరిష్కారం

***భారత్ మూడు అంకెల సవాలును ఎదుర్కొంటోందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తరచూ చెబుతుంటారు.***

1) భారత్‌లో పనిచేసేవారిలో 85-90% మంది ఇప్పటికీ అసంఘటిత రంగంలో ఉన్నారు. వీరిది రోజువారీ జీవనపోరాటం. రెక్కాడితేగానీ డొక్కాడదు. నెలవారీ జీతం, రిటైరయ్యాక పెన్షన్ వంటి జీవన భద్రతలు చట్టబద్ధంగా ఉండవు.

2)పట్టణాలు అభివృద్ధికి పర్యాయపదమైనప్పటికీ.. దేశ జనాభాలో 65% ఇప్పటికీ గ్రామాలలో జీవిస్తున్నారు.

3)పంట పండినా, ఎండినా వ్యవసాయం రైతుకు లాభం కలిగించని విధంగా వరుస ప్రభుత్వాల విధానాలు ఉన్నా.. ఇప్పటికీ దేశ జనాభాలో సుమారు 46% మందికి సాగురంగమే ప్రధాన ఆదాయవనరు.

ఈ మూడు అంకెలనూ వేగంగా అధిగమించటంపై భారత దేశ పురోభివృద్ధి ఆధారపడి ఉందని, ఈ సవాలును ఇండియా ఎలా ఎదుర్కుంటుందోనని ప్రపంచమంతా విప్పారిన కళ్లతో చూస్తోందని జేపీ వీలున్న ప్రతి సమావేశంలోనూ ప్రస్తావిస్తున్నారు. ఇరాన్ యుద్ధ పరిణామాలు, ప్రపంచీ కరణ ఒడిదుడుకులు, ఎల్‌నినో, యువతలో పెరుగుతున్న అసంతృప్తి వంటి అనివార్య ప్రభావాల్ని కూడా ఈ మూడు పరిష్కారాల కోణంలోనే మనం ఎదుర్కోవాల్సి ఉంది.

అయితే ప్రపంచం నలువైపుల నుండి సవాళ్లు ఉరుముతున్నా.. ఈ సవాళ్లను మన ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు స్పష్టంగా తలకెక్కించుకున్నట్లు కనిపించదు. మన కంటే ఎక్కువగా మన దేశ సమస్యలను విదేశీయులు ఎక్కువగా గుర్తించినట్లు కనిపిస్తుంది. ఇటీవల ఎన్.డి.టి.వి ఆంగ్ల ఛానల్ ఢిల్లీలో రెండు రోజులపాటు ఓ ప్రపంచ సదస్సును నిర్వహించింది. ఇందులో భాగంగా ఒకరోజు ప్రముఖ రాజకీయ నేతల ప్రసంగాల్ని, ఇంటర్వ్యూల్ని ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, శ్రీలంక ప్రధాని హరిణి అమరసూరియ, బ్రిటన్, ఆస్ట్రేలియా మాజీ ప్రధానులు రిషీ సునాక్, టోనీ అబాట్ తదితరులు మాట్లాడారు. భారత్‌కి సంబంధించి కొన్ని కీలకాంశాలను ప్రస్తావించారు. పరిష్కారాలు సూచించారు. ముఖ్యంగా టోనీ అబాట్, రిషీ సునాక్‌లకు మన దేశం పట్ల అవగాహన కొంత ఆశ్చర్యం కూడా కలిగిస్తుంది.

జేపీ పేర్కొన్న రెండు సవాళ్లని ఎన్.డి.టి.వి సదస్సు ఇంటర్వ్యూలో టోనీ అబాట్ స్పష్టంగా ప్రస్తావించారు.




'ప్రజాస్వామ్యానికి ప్రపంచంలోనే భారతదేశం కీలకమైనదని.. చైనాను ఎదుర్కోవటంలో, సమతూకపరచటంలో ప్రధానపాత్ర పోషిస్తోందని' టోనీ అబాట్ అన్నారు. అమెరికాతో ఆస్ట్రేలియాకున్న సంబంధాల రీత్యా.. పోటస్ డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల సమయం నుండి చేసిన కొన్ని అసంబద్ధ, అవాంఛనీయ వ్యాఖ్యలపై మాట్లాడటానికి టోనీ తొలుత సంకోచించారు. అయితే, భారత్‌ను అలా అనటం పొరపాటేనని ఆ తర్వాత స్పష్టం చేశారు. కొన్ని సార్లు అలాంటి దురదృష్టకర పరిణామాలు చోటు చేసుకుంటాయన్నారు. అమెరికా ప్రయోజనాలు.. చైనాతో, పాకిస్థాన్‌తో కంటే భారత్‌తోనే ఎక్కువ ముడిపడి ఉన్నాయన్నారు. ఈ మాటలు చెబుతూ.. భారత అభివృద్ధికి జేపీ వెల్లడించే గణాంకాలను ప్రస్తావించారు. 'అత్యధిక జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉండటం, అసంఘటిత రంగంలో ఎక్కువమంది కార్మికులు కొనసాగుతుండటం' అనే సవాళ్లను పరిష్కరించుకునేందుకు భారత్ వెంటనే పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా, ఆస్ట్రే లియాలో భారతీయులపై జరుగుతున్న దాడులపై కూడా వాస్తవాలు వెల్లడించారు. చాలా సందర్భాల్లో మన మీడియాలో వచ్చే కథనాలకు భిన్నంగా టోనీ అబాట్ వివరణ ఉంది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో శాంతిభద్రతల సమస్య ఉందని, అక్కడ చట్టబద్ధపాలన సక్రమంగా అమలయ్యేందుకు కఠిన సంస్కరణలు అవసరమన్నారు. అక్కడ భారతీయులేకాదు, అన్ని దేశాలవారి మీదా కొన్ని ముఠాలు దాడులు చేస్తున్నాయన్నారు. మిగతా ఆస్ట్రేలియాలో భారతీయుల్ని అభివృద్ధిలో భాగస్వాములు గానే అందరూ గుర్తిస్తారన్నారు. భారత ఎన్నికల నిర్వహణ తీరును టోనీ ప్రత్యేకించి ప్రశంసించారు. స్వతంత్ర ప్రతిపత్తితో ఇండియాలో ఎన్నికలు జరుగుతూ, అధికారం శాంతియుతంగా బదిలీ అవుతుంటుందని.. గొప్ప ప్రజాస్వామ్యానికి ఇది సంకేతమన్నారు.

**సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధనం, పరిశోధనలపై దృష్టి కీలకం**

రిషీ సునాక్ భారత్‌కు రెండు ప్రధాన సూచనలు చేశారు. బహుళ ధృవ ప్రపంచంలో భారత్ కీలకమైనదన్నారు. ఇండియా తన సామర్థ్యానికి తగ్గ అభివృద్ధిని సాధించాలంటే.. సాంకేతికతలు, ఇంధనం కీలకమని తెలిపారు. టెలిఫోన్, టీవీ వంటి సాంకేతికతలు ప్రపంచవ్యాప్తం కావటానికి శతాబ్దం, దశాబ్దాలు పట్టాయని.. కానీ చాట్ జీపీటీ (ఓపెన్ ఏ.ఐ) కేవలం రెండు నెలల్లో 100 మిలియన్ డౌన్‌లోడ్‌లు జరిగాయని తెలిపారు. ఇంత వేగవంతమైన కొత్త టెక్నాలజీల్లో భారత్‌లో ఇటీవల పెట్టుబడులు పెరుగుతున్నా, వాటి వినియోగానికి అవసరమైన ఇంధనాన్ని పర్యావరణ హితంగా సమకూర్చుకునేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలన్నారు. పరిశోధన మీద బాగా దృష్టి సారించాలన్నారు.

భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థని, కానీ ప్రపంచస్థాయి దేశంగా ఎదగాలంటే క్రికెట్ లోలా పోటీపడాలని 2028 ఒలింపిక్స్‌ను ఉదహరించారు. ఆ ఒలింపిక్స్‌లో భారత్ ప్రపంచ క్రికెట్ ఆడుతుంటే దేశ ప్రజలంతా భాగస్వాములవుతూ, దేశానికి ఎలా ఆదాయాన్నిస్తారో.. అదే రీతిలో ఆర్థికాభివృద్ధి గణంకాలు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలన్నారు. ఇదేసమయంలో ప్రేక్షకుల్లో ఉన్న ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి, సుధామూర్తి దంపతుల్లో (రిషీ సునాక్ అత్తమామలు) ఎవరంటే ఎక్కువ ఇష్టమని ఎన్.డి.టి.వి ప్రధాన ఎడిటర్ రాహుల్ కన్వల్ అడిగారు. ఇద్దరు పిల్లల మధ్య ఎవరంటే ఎక్కువ ఇష్టమని అడిగితే ఏం చెప్తాం? అని రిషీ సమాధానమిచ్చారు. గతంలో సుప్రీంకోర్టు చెప్పినా, ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినా.. తల్లిదండ్రుల్ని, అత్తమామల్ని జాగ్రత్తగా చూసుకునే బాధ్యత కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లకు సమానంగా ఉందని రిషీ సునాక్ బహిరంగంగా తెలియచేశారు. ఇది వినటానికి చాలా చిన్న విషయంలా అనిపించవచ్చు.. కానీ చాలా ముఖ్యమైన, భారతీయ సామాజిక, ఆర్థిక వ్యవస్థలో రాబోయేకాలంలో చాలా ప్రాముఖ్యత సంతరించుకునే విషయం. అదేవిధంగా, తనను రాజకీయాల్లోకి వెళ్లమని ప్రోత్సహించింది నారాయణమూర్తి అని రిషీ సునాక్ చెప్పినప్పుడు.. ఎందుకలాంటి సలహా ఇచ్చారని నారాయణమూర్తిని ప్రజంటర్ అడిగారు. నిబద్ధత, నిజాయతీ, సామర్థ్యం గల రిషీ సునాక్ లాంటి వారి అవసరం రాజకీయాల్లో మిగతా అన్ని రంగాల్లో కంటే ఎక్కు వగా ఉందని ఆయన సమాధానమిచ్చారు. అది ఛాదస్తం కింద రాహుల్ కన్వల్ కొట్టివేశారుకానీ.. అలాంటి నాయకత్వాన్ని తయారుచేసుకోవటం తప్ప భారత్‌కి, ప్రపంచానికి పరిష్కారం లేదు.

**మానవాభివృద్ధి సూచిలో శ్రీలంక ముందంజ**

మానవ పరిణామ శాస్త్రవేత్త (ఆంత్రోపాలజిస్ట్) అయిన శ్రీలంక ప్రధానమంత్రి హరిణి అమరసూరియ ఓపక్కన భారత్‌తో సంబంధాలు తమకు ఎంత విలువైనవో చెబుతూనే.. మానవాభివృద్ధి సూచిలో శ్రీలంక భారత్ కంటే ఎంత ముందుందో సగర్వంగా వెల్లడించారు. పాఠశాలలు, ఆస్పత్రులు, మహిళల రక్షణ, న్యాయవ్యవస్థ మొదలైన అంశాలు ప్రజల సాధికారతకు ముఖ్యమని తెలిపారు. పర్యావరణహిత ఆర్థిక వ్యవస్థతో శ్రీలంక వేగంగా కోలుకుంటున్నతీరును వివరించారు. సుమారు 31 ఏళ్ల క్రితం ఢిల్లీలో ఆమె చదువుకున్నారు. అప్పటి ఇండియాకి, ఇప్పటి భారత్‌కి ఎంతో తేడా ఉందని.. అనేక రెట్లు అభివృద్ధి కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ ద్వారా చట్టసభల్లోకి వెళ్లాలనుకుంటున్న భారతీయ అమ్మాయిలు నాయకత్వం, విశ్లేషణ వంటి పలు సామర్థ్యాల్ని అలాంటివారి నుండి నేర్చుకోవాలి.

**అన్‌స్టాపబుల్ ఆత్మవిశ్వాసం**

ప్రధాని మోదీ 'అన్ స్టాపబుల్ ఇండియా' ఇతివృత్తం మీద మాట్లాడారు. ఇందులో చాలా అంశాలు కేవలం పెట్టుబడిదారుల్ని ఆకర్షించటం కోసమే తప్ప, ప్రపంచస్థాయి నాయకుల వేదిక మీద మాట్లాడేవిగా అనిపించకున్నా.. కొన్ని ఆసక్తికర వ్యాఖ్యల్ని చేశారు. కొన్నేళ్లక్రితం ఇలాంటి పేరుతో చర్చాంశాన్ని భారతకు ఎంపిక చేసేవారు కాదని, భారత్ అంతర్జాతీయ ఒడిదుడుకులను ఎలా తట్టుకోగలదు వంటి రీతిలో ఇతివృత్తాలుండేవని.. కానీ ఈవేళ అన్ స్టాపబుల్ అనే రీతిలో ఆత్మవిశ్వాసంతో మాట్లాడగలుగుతున్నామన్నారు. ప్రపంచంలో భారత్ ప్రాధాన్యతను ఎవరూ విస్మరించలేరన్నారు. ఈవేళ దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు.. కనిపించని అవకాశాలన్నారు. 'గరీబీ హఠావో' నినాదం మీద బతికేసే రాజకీయం కాకుండా.. పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించే రాజకీయాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రజల జీవన నాణ్యతను, ఆదాయాల్ని పెంచటం తమకు అత్యంత ప్రాధాన్యాంశమన్నారు. మావోయిస్టు హింస కనుమరుగవుతుండటం, కోట్ల మంది ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతుండటం 2047 వికసిత్ భారత్ దిశగా అడుగులని ఉదహరించారు.

**చిన్న పట్టణాల్లో పెరగాల్సిన తయారీరంగం –**

వికసిత్ భారత్‌కి 95% ఆదాయానికి పట్టణీకరణే మార్గం పైన పేర్కొన్న నేతలంతా కీలకమైన అంశాలను ప్రస్తావించినా, అన్నిటికీ సమగ్ర పరిష్కారాల్ని సూచించలేదు. ఉదాహరణకు, టోనీ అబాట్.. భారత్‌లో పనిచేసేవారిలో

అత్యధికులు అసంఘటిత రంగంలో ఉండటం, వ్యవసాయం మీద ఆధారపడినవారి సంఖ్య మితిమీరి ఉండటం ప్రస్తావించారుగానీ, పరిష్కారాల్ని చెప్పలేదు. దీనికి పరిష్కారం కూడా జేపీ చెబుతున్న సంస్కరణల్లో ఉంది. గ్రామాల మధ్య చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి అక్కడ పరిశ్రమలతో తయారీ రంగాన్ని ప్రోత్సహించాలి. దీనివల్ల ప్రధాని మోదీ ప్రస్తావించిన ఆరోగ్యం, విద్య, సమ్మిళిత అభివృద్ధి వంటి అనేక అంశాలకు కూడా మెరుగైన పరి ష్కారం లభిస్తుంది. 2047 నాటికి నిర్దేశించుకున్న 'వికసిత్ భారత్' లక్ష్యం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలో 90-95% పట్టణాల నుండే వస్తుంది. పట్టణీకరణ సవ్యంగా లేకుంటే అది సాధ్యం కాదు. ప్రతి గ్రామం రూర్బన్‌గా మారటమూ సరిపోదు. మనకు పట్టణం అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం మాత్రమే. కానీ పట్టణీకరణ ఆర్థికాభివృద్ధి కేంద్రంగా సాగితేనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం. అందువల్లే ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా రోజువారీ అవసరాలకు ప్రజలు రాకపోకలు సాగించే గ్రామీణ క్లస్టర్లనే చిన్న పట్ట ణాలుగా అభివృద్ధి చేయాలని సూచిస్తున్నాయి. అదేవిధంగా, ఏఐ వినియోగం పెరుగు తున్నకొద్దీ, ప్రతికూలతల్ని తట్టుకోవటానికి మహానగరాల కంటే.. ప్రజలకు అవగాహన ఎక్కువగా అవగాహన ఉండే చిన్న పట్టణాలు, అక్కడ స్థానిక సాధికారత ఎంతో ఉపయోగపడతాయి. పర్యావరణహిత ఆర్థికాభివృద్ధిలో అక్కడ కొద్దిపాటి నైపుణ్యంతో అందరూ ఏదోక ఉపాధిని అందుకోగలరు. తయారీరంగం ఆధునికమై విస్తరిస్తుంది. ఎంతో కీలకమైన ప్రజారవాణాను ఫ్లైఓవర్లు వంటి ఆర్భాటాలు లేకుండా, సౌకర్యవంతంగా అమలు చేయవచ్చు. ఇంటి వద్ద నుండి బయల్దేరి తిరిగి ఇంటికి చేరేదాకా సొంత వాహనం అవసరం లేకుండా, అనుకున్న సమయానికి చేరుకునే విధంగా ఏర్పాటు చేయవచ్చు. ఈ నేపథ్యంలోనే, మహానగరాలను గ్రీన్‌ఫీల్డ్ సిటీలుగా అభివృద్ధి చేస్తూనే, గ్రామీణ చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసే 'జాతీయ పట్టణీకరణ విధానం' ప్రకటించాలి. అదేవిధంగా, భూ, కార్మిక చట్టాలను సంస్కరించి సరళీకరించాలి (అయిదారేళ్ల తాత్సారం తర్వాత ఇటీవల కార్మిక కోడ్ లను నోటిఫై చేశారు).. కనీసం కాంట్రాక్టులు సక్రమంగా అమలయ్యేలా చట్టబద్ధపాలన అమలు చేయాలి. అదేవిధంగా, హరిణి అమరసూరియ ప్రస్తావించిన అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని శ్రీలంక పెట్టుబడిదారుల సెజ్ (ఈ సెజ్ గురించి సైతం జేపీ తరచూ ప్రస్తావిస్తుంటారు. ఇటీవల యూనియన్ వాణిజ్య మంత్రి పీయుష్ గోయెల్, విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు కూడా ప్రత్యేకించి ఈ పరిశ్రమ నమూనాను సందర్శించి ప్రశంసించారు. వస్త్ర ఎగుమతులపై సంస్థ ఎదుర్కొంటున్న కొన్ని సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ తరహా పరిశ్రమలు

> **ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా రోజువారీ అవసరాలకు ప్రజలు రాకపోకలు సాగించే గ్రామీణ క్లస్టర్లనే చిన్న పట్ట ణాలుగా అభివృద్ధి చేయాలని సూచిస్తున్నాయి. అదేవిధంగా, ఏఐ వినియోగం పెరుగుతున్నకొద్దీ, ప్రతికూలతల్ని తట్టుకోవటానికి మహానగరాల కంటే.. ప్రజలకు అవగాహన ఎక్కువగా అవగాహన ఉండే చిన్న పట్టణాలు, అక్కడ స్థానిక సాధికారత ఎంతో ఉపయోగపడతాయి.**

గ్రామాల మధ్య పెరిగి, తయారీరంగంలో ఇబ్బడిముబ్బడిగా ఉపాధి అవకాశాలు రావాలన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉపాధి కోరుకునే మహిళలందరికీ, సుమారు 22,000 మందికి అవకాశం ఇచ్చిన కంపెనీ బ్రాండిక్స్. ఇటీవల బ్రాండిక్స్ పేరును అధిస్థాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్- ఏఐఐపీగా మార్చి, వస్త్రాలతోపాటు ఇతర రంగాలకూ విస్తరిస్తున్నారు) తరహాలో అనేకచోట్ల ఉపాధి ఆధారిత, ముఖ్యంగా కార్మికశక్తిలో మహిళల పాత్రను పెంచే ఆర్థిక ఔత్సాహిక వాతావరణం అన్ని దిక్కులా, స్థానికంగా వెల్లి విరుస్తుంది. దేశ ఆర్థిక వృద్ధి రేటు గరిష్ట స్థాయిలో సాధ్యమవుతుంది. ఒక్క పరిష్కారంతో ఇన్ని సంస్కరణలు సాధ్యమవటం అరుదు. అందువల్లే.. చిన్న పట్టణాలు భారత్‌కి పెద్ద పరిష్కారంగా పేర్కొనవచ్చు.

అదేవిధంగా, ఏ.ఐ - భవిష్యత్తు ఉపాధి, బహుళ సాంస్కృతిక వాదం, ఇండో-పసిఫిక్ లో భారత విదేశాంగ విధానం, ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం మొదలైన అంశాలపై కూడా ఆయా రంగాల నిపుణులు కీలక ప్రసంగాలు చేయటంతో పాటు.. భారత వాణిజ్యవేత్తల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఏ సమస్యను కదిలిస్తే, మొత్తం వ్యవస్థంతా కదులుతుందో అలాంటి సమస్యల్ని దేశీయంగా గుర్తించటం.. వాటికి నిర్దిష్ట, ఆచరణసాధ్య, హేతుబద్ధ పరిష్కారాల్ని మిగతా దేశాల అనుభవాల నుండి నేర్చుకుంటూ మరింత సమర్థంగా అమలు చేయటం, ఇంట గెలుస్తూ అంతర్జాతీయంగా కీలకపాత్ర పోషించటం - ముఖ్యంగా భారత్‌ని మిగతా ప్రపంచ దేశాలు గుర్తించటానికి కారణమైన ఆర్థికాభివృద్ధిని సుస్థి రంగా పెంపొందించుకోవటం, అందుకు ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ ఉత్పాదక రంగాలపై దృష్టి సారిం చటం మొదలైన అంశాలు మన సమాజంలో వేళ్లూను కోవటానికి ఇలాంటి సదస్సుల్ని వివిధ స్థాయిల్లో దేశం నలుమూలలా జరుపుతుండటం అవసరం. నిర్దిష్ట పరిష్కా రాలను గుర్తించటంలో మీడియా, పౌర సమాజ సంస్థలూ ఇందులో ప్రధానపాత్ర పోషించాలి. ✢

# చమురు దిగుమతుల పాఠం - 100% ఈవీలకు మళ్లుదాం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



"ప్రస్తుత ఇంధన ప్రకంపనలు మనకో మేలుకొలుపు కావాలి. వచ్చే 5-10 ఏళ్లలో చమురు, గ్యాస్ దిగుమతుల్ని గణనీయంగా తగ్గించే ఆచరణ సాధ్య, సంఘటిత కార్యాచరణకు మనల్ని పురిగొల్పాలి. సాంకేతికత, ఖర్చు తగ్గుదల ఇప్పటికే మిగిలిన ప్రపంచంతోపాటు మన ఆర్థిక వ్యవస్థకి కూడా ఇంధన సానుకూలతని అందిస్తున్నాయి.

**యు**ద్ధము, శాంతి మధ్య అమెరికా, ఇరాన్ దోబూచులాడుతుండటంతో.. పర్షియా సింధుశాఖ, హోర్ముజ్ జలసంధి పరిణామాల్ని ఊహించటం బాగా కష్టమవుతోంది. ఎక్కువమంది సానుకూలంగా స్పందిస్తున్న ప్రాథమిక ఒప్పంద నమూనా, ఇప్పటికీ అయోమయంగానే ఉంది. వచ్చే కొన్ని రోజుల్లో అటువంటి ఒప్పందం మీద సంతకాలు జరగొచ్చుగానీ.. సుస్థిర శాంతికి అవకాశాలు మాత్రం ఇప్పటికీ సుదూరమే. జలసంధి ఎప్పుడైనా మళ్లీ మూతపడే అవకాశముంది. హోర్ముజ్‌లో సముద్ర రవాణాకి అనుమతించినా.. చమురు, గ్యాస్, ఎరువులు, ఇతర కీలక సరకుల సరఫరాల పునరుద్ధరణ ఇప్పటికిప్పుడైతే సాధ్యం కాదు. ఏ రకంగా చూసినా. ప్రస్తుత అంతరాయం వల్ల తలెత్తిన కష్టాలు, ఆర్థిక ప్రతికూలతలకు ముగింపు పలికి తిరిగి సాధారణ స్థితిని నెలకొల్పటానికి నెలల తరబడి సమయం పట్టవచ్చు. అన్నిటికంటే ఆందోళన కలిగిస్తున్న అంశం - హోర్ముజ్ జలసంధిని మూసివేయటం ద్వారా ఓ కొత్త సాంప్రదాయానికి తెరతీయటం.

ఇంతకుముందు వరకు చమురు ప్రకంపనలు ధరల పెరగటం కారణంగానే చోటుచేసుకునేవి. చమురు ఎగుమతి దేశాలు ఒక ముఠాగా కూడబలుక్కుని ధరల్ని పెంచు తుండేవారు. ఎమర్జెన్సీకి ముందు 1973లో అదే జరిగింది. కానీ ప్రస్తుత సంక్షోభం సరఫరా అంతరాయం వల్ల కలిగినది. ఎన్నడూ ఊహించని విధంగా, ఒక కీలక సముద్ర మార్గాన్ని మూసివేశారు. భవిష్యత్తులో ఎప్పుడైనా, ఎవరైనా ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడే అవకాశముంది.

ఈ నేపథ్యంలో, మొత్తం పరిణామాలు భారతదేశానికి ఏం చెబుతున్నాయి? మనం 90% వరకు చమురును, 50 శాతానికిపైగా వంటగ్యాస్‌ని (ఎల్పీజీ) దిగుమతి చేసుకుంటున్నాం. ఇంధనావసరాలకి దిగుమతుల మీద ఆధారపడటమే కొన్ని దశాబ్దాలుగా మన వాణిజ్యలోటు మొత్తానికీ కారణమంటే అతిశయోక్తి కాదు.

2026 ఆర్థిక సంవత్సరంలో మన మొత్తం ఇంధన దిగుమతులు సుమారు 162 బిలియన్ డాలర్లు. వాణిజ్య లోటు 119.3 బిలియన్ డాలర్లు. సరఫరా అంతరాయాలు, అధిక ధరలు అలాగే కొనసాగితే.. 2027 ఆర్థిక సంవత్సరంలో ఇంధన దిగుమతి ఖర్చు పైపైకి ఎగిసి 240 బిలియన్ డాలర్లయ్యే అవకాశముంది. ఎరువుల దిగుమతికయ్యే అదనపు వ్యయ భారాన్ని కూడా కలిపితే, దిగుమతి బిల్లు మరో 25-30 బిలియన్ డాలర్లు పెరుగుతుంది. వాణిజ్య లోటుకి అదనంగా చమురు, గ్యాస్ ధరలు పెరగటం.. ద్రవ్యోల్బణాన్ని అనివార్యంగా పెంచుతుంది. సబ్సిడీ తడిసి మోపెడవుతుంది (ఖర్చు తిరిగి రాకపోవటం, ఎరువుల రాయితీలు). ద్రవ్యలోటు విస్తరిస్తుంది. ఫలితంగా, ఆర్థిక వృద్ధి కుంగదీస్తాయి. పెట్టుబడి (ప్రభుత్వ, స్వదేశీ ప్రయివేటు రంగం, ఎఫ్డీఐలు) కొరవడినప్పుడు వృద్ధి ఎలా కొనసాగుతుంది? పెరుగుతుండే ఇంధన ధరలు, వాణిజ్య లోటు, రూపాయి పతనం, స్టాక్ మార్కెట్‌లో విదేశీ పెట్టు బడులు (ఎఫ్పీఐలు) తరలిపోవటం, ఎఫ్డీఐల విముఖత, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న ద్రవ్య లోట్లు, అరకొర పెట్టుబడులు, తక్కువ వృద్ధి, క్షీణించే ఆదాయాలు, ఉన్నకొద్దీ పెరిగే ద్రవ్యలోట్లు- ఒక విషవలయంగా మారే నిజమైన ప్రమాదం పొంచిఉంది. కీలక సమయంలో మన ఆర్థిక వేగానికి ఇది విఘాతంగా పరిణమించే అవకాశముంది.

ప్రస్తుత ఇంధన ప్రకంపనలు మనకో మేలుకొలుపు కావాలి. వచ్చే 5-10 ఏళ్లలో చమురు, గ్యాస్ దిగుమతుల్ని గణనీయంగా తగ్గించే ఆచరణసాధ్య, సంఘటిత కార్యాచరణకు మనల్ని పురిగొల్పాలి. సాంకేతికత, ఖర్చు తగ్గుదల ఇప్పటికే మిగిలిన ప్రపంచంతోపాటు మన ఆర్థిక



వ్యవస్థకి కూడా ఇంధన సానుకూలతని అందిస్తున్నాయి. చమురు, గ్యాస్‌పై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తున్నాయి. పునరుత్పాదక ఇంధనం, హరిత సాంకేతికతలకు మళ్లటం వల్ల ఇప్పటికే శిలాజ ఇంధనాలపై ఆధారపడాల్సిన అవసరం 10% దాకా తగ్గినట్లు అంచనా. చమురు సరఫరాను 15-20% మేర మూసివేసినా, డిమాండ్‌లో తగ్గుదల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ చాలామేర తట్టుకోగలిగింది. భారత్‌కున్న కీలక సవాలు - దిగుమతి చమురు, గ్యాస్, ఎల్‌పీజీ మీద ఆధారపడటాన్ని తగ్గించుకోవటం. ఇప్పటికే ఇంధన స్వావలంబన సామర్థ్యాన్ని పెంచుకునేందుకు, దిగుమతుల్ని తగ్గించేందుకు గణనీయ చర్యలు తీసుకుంటున్నారు. సౌర విద్యుదుత్పత్తి, విద్యుత్ నిల్వ, విద్యుత్ వాహనాలు (ఈవీలు) ఈ మౌలిక మార్పుకి కేంద్రబిందువుగా ఉన్నాయి. మన సౌర విద్యుత్ స్థాపక సామర్థ్యం 154 గిగావాట్లు (మొత్తం విద్యుత్ స్థాపక సామర్థ్యంలో 28.5%). ఏడాదికి 300 బిలియన్ యూనిట్ల ఉత్పత్తి సామర్థమిది (మొత్తం ఉత్పత్తిలో 14%). ఈ మొత్తం సామర్థ్యాన్ని దాదాపు గడచిన కొన్నేళ్లలోనే సమకూర్చారు. ఇదే సంకల్పాన్ని కొనసాగిస్తే.. 2030కి 500 మెగావాట్ల లక్ష్యం అసాధ్యం కాదు. కానీ మనకు ఇప్పుడున్న అవసరాలకు ఇది చాలదు. ఇంకా ఎక్కువ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. చైనా 1200 గిగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని నెలకొల్పింది. 2,400 బిలియన్ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యమిది (మొత్తం ఉత్పత్తిలో 21%).

సౌర విద్యుదుత్పత్తితో పాటు.. మనం విద్యుచ్ఛక్తిని బ్యాటరీల్లో నిల్వ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి. అప్పుడే వినియోగం ఆచరణలో సాధ్యమవుతుంది. మన ప్రస్తుత బ్యాటరీ స్టోరేజీ (బీఈఎస్ఎస్) బహు స్వల్పం. రోజువారీ సౌర ఉత్పత్తిలో 1% కంటే బాగా తక్కువ. చైనా సౌర ఉత్పత్తిలో 12% నిల్వకి బీఈఎస్ఎస్‌ను నెలకొల్పింది. 2032 నాటికి బీఈఎస్ఎస్ ద్వారా 346 జీడబ్ల్యూహెచ్ (గిగావాట్-అవర్)ను ఉత్పత్తి చేయాలని యూనియన్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇది 63 గిగావాట్ల సౌర విద్యుదుత్పత్తికి సమానం. సీఈఏ అంచనాల ప్రకారం, మనకు ఇంతకంటే ఎక్కువ అవసరం. మన పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లు సౌర విద్యుదుత్పత్తిని పెంచటానికి, నిల్వకి అపార వనరులు, సమన్వయం, మౌలిక వసతులు, సరకు రవాణా ఏర్పాట్లు, ప్రోత్సాహకాలు అవసరం.

సౌర విద్యుత్తు వల్ల నిజమైన ప్రయోజనం.. రోడ్డు ప్రయాణాలు, రవాణాలో మనం పూర్తిస్థాయి విద్యుత్ పంథాలోకి (ఈవీలు) మారినప్పుడే సాధ్యం. అడుగులైతే మొదలుపెట్టాంగానీ, ఈ దిశగా చేయాల్సింది చాలా ఉంది. 2025లో, ఈవీ కార్ల అమ్మకాలు 1.65 లక్షలు కాగా, ద్విచక్ర వాహనాలు 1.3 మిలియన్, త్రిచక్ర వాహనాలు 8 లక్షలు మేర అమ్ముడయ్యాయి. మొత్తం అమ్మకాల్లో వీటి వాటా 4.4%, 6.4%, 61% మేర ఉన్నాయి. మనకి భిన్నంగా చైనాలో.. మొత్తం కార్లలో 48%, ద్విచక్ర వాహనాల్లో 55% విద్యుత్‌తో నడుస్తున్నాయి. వచ్చే 5-10 ఏళ్లలో మనం రోడ్డు రవాణా విద్యుదీకరణను యుద్ధప్రాతిపదికన కొనసాగించాలి. భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్‌తో నడిచే మోటారు వాహనాల తయారీయే ఉండనంతగా ఈ సంఖ్యను పెంచాలి. ఇది పెద్ద లక్ష్యమే. అయినా, ఆచరణసాధ్యమయిన లక్ష్యం. సాంకేతికత సమస్య లేదు. ఈవీల ధర ఇప్పటికే డీజిల్, పెట్రోల్ వాహనాల స్థాయికి వచ్చేసింది. వీటి ఇంధన వినియోగమైతే, కిలోమీటరుకు చమురు వాహనాల కంటే చాలా స్వల్పస్థాయిలో ఉంది. చమురుకయ్యే ఖర్చులో కేవలం 10-20%. ఇక నిజమైన సవాళ్లు- సౌర విద్యుదుత్పాదన, నిల్వ, అందుబాటులో ఛార్జింగ్ మౌలిక వసతులు.


మొత్తం రోడ్డు రవాణా విద్యుదీకరణకు ఏడాదికి సుమారు 600 బిలియన్ యూనిట్ల ఇంధనం కావాలని అంచనా. అంటే, రోజుకు దాదాపు 1.6 బిలియన్ యూనిట్లు. ఇది 100 గిగావాట్ల నిరంతరాయ అదనపు విద్యుదుత్పత్తికి సమానం. అంటే, సౌర విద్యుత్ సామర్థ్యంలో 300 గిగావాట్ల మేర ఉంటుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం ఇది పూర్తిగా సాధ్యం. అసలైన సవాలు- ఈవీలను సౌర విద్యుదుత్పత్తి జరిగే సూర్యకాంతి సమయంలో వేగంగా ఛార్జింగ్ చేయటం. దీనివల్ల నిల్వకయ్యే విపరీత వ్యయభారం తగ్గుతుంది. విద్యుదుత్పత్తి సమయంలోనే గరిష్ట వినియోగమవుతూ ఖర్చు పరిమితంగా ఉంటుంది. పగటిపూట ఈవీలని ఛార్జింగ్ చేయాలంటే వేగంగా ఛార్జింగ్ సదుపాయాన్ని విధిగా అందుబాటులోకి తేవటం, ఛార్జింగ్ అవసరాలకు తగ్గట్లు పంపిణీ నెట్‌వర్క్‌ను నిర్మించటం, సూర్యరశ్మి అందుబాటులో ఉన్నప్పుడు తక్కువ ధర; నిల్వ

చేసిన ఇంధనాన్ని వినియోగించేటప్పుడు ఎక్కువ మొత్తం వసూలు.. రోడ్డు రవాణాను వంద శాతం వేగంగా విద్యుదీకరించటానికి తప్పనిసరి అవసరాలు.



### ఇంటి వద్ద వరకూ 'ఒకే డిజిటల్ టికెట్‌తో బహుళ ప్రజారవాణా'నూ ఈవీ కార్యక్రమంతో సంధానించాలి

నగరాల్లో ట్రాఫిక్ నరకం, ప్రమాదాలు, కాలుష్యం లేకుండా బహుళ ప్రజా రవాణాను ఇంటి వద్ద వరకు అనుసంధానంతో మెరుగుపరిచి, వ్యక్తిగత ప్రయివేటు వాహనాలను పరిమితం చేయటాన్ని కూడా వంద శాతం ఈవీ ప్రణాళికలో భాగం చేయాలి. హైదరా బాద్‌నే తీసుకుంటే.. 65–70% ప్రయి వేటు వాహనాలు, 30% మాత్రమే ప్రజారవాణా ఉంది. అంటే, తల్లకిం దులుగా ఉంది. దీన్ని మార్చి.. ప్రజా రవాణాను 70% దాకా పెంచేం దుకు; మెట్రో, ఆర్‌టీసీ, ఎంఎంటీఎస్, ఇ–సైకిళ్ల మధ్య 'ఒకే డిజిటల్ టికెట్‌తో' సంధానం ఉండేట్లు నిపుణులతో కలిసి ఎఫ్.డీ.ఆర్, లోక్‌సత్తా ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తూ ప్రభుత్వానికి ఒక రోడ్‌మ్యాప్‌ను అందించే ప్రయత్నం చేస్తోంది. అన్ని రకాల రోడ్డు రవాణా వాహనాలను ఈవీలుగా మార్చటం ద్వారా, భారత్‌లో మనం 120 బిలియన్ లీటర్ల డీజిల్‌ను, 62 బిలియన్ లీటర్ల పెట్రోల్‌ను ప్రతి సంవత్సరం ఆదా చేసుకోగలం. దీంతో, ముడిచమురు దిగుమతులు తగ్గుతాయి. వెంటనే కాకున్నా, డీజిల్, పెట్రోల్ వాహనాలను వినియోగాన్ని క్రమంగా దశలవారీగా తొలగించటం. దీనివల్ల, దిగుమతుల్ని ఏడాదికి సుమారు 160 మిలియన్ టన్నుల చొప్పున తగ్గించవచ్చు. ప్రస్తుత ధరల ప్రకారం, ఈ తగ్గింపు 160–180 బిలియన్ డాలర్లు. 2025 ధరల ప్రకారమైతే, 90 బిలియన్ డాలర్లు. బహిరంగ ఈవీ ఛార్జింగ్ నెట్‌వర్క్ విస్తరణ కార్యక్రమాన్ని ఇప్పటికే యూనియన్ ప్రభుత్వం ప్రకటించింది. 2026 నాటికి ప్రజలకు 72,300 కొత్త ఛార్జింగ్ సదుపాయాలు అందుబాటులోకి రావటానికి రూ.10,900 కోట్లు కేటాయించింది. ఈవీ వాహనాలకు త్వరగా మళ్లటానికి మనం ఈ సదుపాయాల్ని విస్తృతి, సంఖ్య పరంగా మరింత ఎక్కువగా అందుబాటులోకి తేవాలి. చైనా ఇప్పటికే 20 లక్షల ఛార్జింగ్ పాయింట్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. అమెరికాలో 1,00,000కు పైగా ఉండగా, భారత్‌లో ప్రస్తుతం 29,000 మాత్రమే అందుబాటులో ఉన్నాయి.




దిగుమతి చమురు మీద ఆధారపడటానికి స్వస్తి పలికి, వాణిజ్య సమతూకాన్ని మెరుగుపరచుకునేందుకు, ద్రవ్య క్రమశిక్షణతో భవిష్యత్తులో ఆర్థిక ఒడిదుడుకులను నిరోధించేందుకు.. ప్రస్తుత చమురు సంక్షోభం మనకు ఒక అపురూపమయిన అవకాశాన్నిస్తోంది. అవసరమైన సాంకేతికత అందుబాటులో ఉంది. ప్రభుత్వ విధానాలు, మౌలిక వసతులు, మోటారు వాహనాల తయారీపై అర్థవంతమైన నియంత్రణ ఉంటే ఈవీల వైపు మళ్లటానికి వినియోగదారులు సైతం సిద్ధంగా ఉన్నారు.

ఇంకో ముఖ్యమైన అంశం – వ్యవసాయ రంగానికి ఈ సంక్షోభాన్ని అవకాశంగా మలచటం. దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చి నాలుగు దశాబ్దాలవుతున్నా, వ్యవసాయంలో ఇప్పటికీ మార్కెటింగ్ స్వేచ్ఛ లేదు. రైతుల చేతులకి సంకెళ్లు కొనసాగుతున్నాయి. చమురు సంక్షోభం నేపథ్యంలో, సాగురంగంలో ఇబ్బడిముబ్బడిగా అవకాశాల్ని సృష్టిం చవచ్చు, రైతుల ఆదాయాల్ని పెంచవచ్చు. కర్షకులలాంటి కష్టజీవులు ఆదాయాలు పెరిగితే, ప్రభుత్వం వద్ద చేయి జాస్తారా?.. ఆత్మగౌరవాన్ని ప్రదర్శిస్తారు.

కాబట్టి, ప్రభుత్వ రాయితీలూ తగ్గుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచవచ్చు. ఇంధన దిగుమతుల్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. ఈ అంశాల్ని తర్వాతి వ్యాసాల్లో చర్చిద్దాం.

✢

# నిస్సందేహంగా మంచి విజయాలు సాధించాం..

ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్



గత 30 ఏళ్లుగా దేశంలో మౌలికమైనటువంటి ఏ పాలనాపరమైన మార్పు వచ్చినా ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ లోక్‌సత్తా ఉద్యమం పాత్ర చాలా గణనీయంగా ఉంది. ఇంకా సాధించాల్సింది చాలా ఉంది. ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయడంలో ఇప్పటికే లోక్‌సత్తా ఉద్యమం నిస్సందేహంగా మంచి విజయాల్ని సాధించింది.

### పాలనాపరమైన మార్పుల్లో లోక్‌సత్తా ఉద్యమం ఎలాంటి పాత్ర నిర్వహించింది?

1997లో సంస్థాగతంగా చట్టబద్ధత ఏర్పాటు చేసుకున్నాం. ఈ దేశంలో ఆనాడు 1997నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 50 ఏళ్లు ... 2026 నాటికి 80 ఏళ్లు. అప్పుడు కానీ ఇప్పుడు కానీ ప్రజలు అనుకున్న ఫలితాలు రాకపోవడానికి ప్రధాన కారణం..రాజకీయ తీరుకు..రాజ్యాంగ విలువలకు మధ్య బోలెడంత అగాధం ఉంది. రాజకీయం తీరు మార్చకుండా, రాజకీయానికి, రాజ్యాంగ విలువలకు ఉన్న అంతరాన్ని పూడ్చకుండా ఈ సమాజంలో అందరికీ అవకాశాలు అందవు..ప్రజాస్వామ్యం అంటే తరచూ ఎన్నికలు జరగడం..అధికారం మారడం, వాక్ స్వాతంత్ర్యం ఉండటం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యం అంటే పార్టీలు కానీ, ఎన్నికలు కానీ, రాజ్యవ్యవస్థ నడిచే తీరు కాని చాలా నిర్దిష్టంగా మనం ఏ రాజ్యాంగ విలువలకైతే లోబడి ఉన్నామని అనుకుంటున్నామో వాటిని అనుసరించాలి. అవి ఎప్పుడైతే లేకుండా పోయాయో అధికార మార్పు వల్ల మాత్రమే పరిస్థితులు మారవని అర్థం అయిందో అప్పుడు ప్రజల నుంచి ఒక ఉద్యమం వస్తుంది. ఆ చారిత్రక అవసరం కారణంగా లోక్‌సత్తా ఉద్యమం వచ్చింది. మన దేశంలో ఏ ప్రజాస్వామ్య ఉద్యమం సాధించనన్న పెద్ద విజయాల్ని లోక్‌సత్తా ఉద్యమం సాధించింది. మార్పు కావాలనే ఆరాటం సమాజంలో అన్ని వర్గాల్లో ఉంది. ప్రధానంగా మధ్య తరగతి వర్గాల్లో కాస్తోకూస్తో చదువుకున్న వాళ్లల్లో, రాజకీయం గురించి అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్న వాళ్లలో, పత్రికల్లో ఇంకా మిగిలి ఉంది. అలాగే రాజ్యాంగ సంస్థల్లో ఈ మార్పు కావాలని ఆరాటం ఉంది. దానికి ఒక నిర్దిష్ట రూపాన్ని ఇవ్వగలిగింది లోక్‌సత్తా ఉద్యమం. ఆ కారణంగానే గత 30 ఏళ్లుగా దేశంలో మౌలికమైనటువంటి ఏ పాలనాపరమైన మార్పు వచ్చినా ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ లోక్‌సత్తా ఉద్యమం పాత్ర చాలా గణనీయంగా ఉంది. ఇంకా సాధించాల్సింది చాలా ఉంది. ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయడంలో ఇప్పటికే లోక్‌సత్తా ఉద్యమం నిస్సందేహంగా మంచి విజయాల్ని సాధించింది. సంఘటితంగా, పరిజ్ఞానంతో జనం నిలబడితే ఈ రాజ్యవ్యవస్థ మార్పుల్ని తీసుకువస్తుందని ఈ అనుభవాలు నిరూపించాయి. చాలా అడుగులు వేయాల్సి ఉంది. రాజకీయాన్ని, రాజ్య వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సి ఉంది.

***ఉద్యోగాన్ని వదిలేసి సమాజంలో మార్పు కోసం ముందుకు వచ్చారు.. లోక్‌సత్తా సంస్థను ప్రారంభించారు..ఇన్నేళ్లలో ఎప్పుడైనా నేను ఎంచుకున్న మార్గం కరెక్టేనా? అనే భావన కలిగిందా?***



ఇది అవసరం..అనవసరమైన పనిచేయడం లేదు. కొందరైనా దీనిలో దిగాలి..తంటాలు పడాలి. అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోవాలి. పరిణితి సాధించాలి. సమాజానికి ఎంతో కొంత మార్గాన్ని చూపెట్టాలి. మార్గాన్ని చూపెట్టే స్పష్టత ఉన్నా కూడా సమాజం అందుకోవడానికి చాలా కాలం పడుతుంది.. నేను కేవలం పిలుపు ఇచ్చాను.. కొన్ని వేల మంది ఇందులో భాగస్వాములయ్యారు. క్యాన్సర్ వంటి వ్యాధితో పోరాడుతున్న వారు కూడా రాత్రీపగలు పని చేశారు. ఇక్కడ పనిచేయడం ద్వారా మరో ఐదేళ్లు జీవితం పెరుగుతుంది సార్ అని చెప్పేవారు..సమాజంలో అంత స్ఫూర్తి ఉంది. మనం ఒక మార్గం చూపెట్టాలే కానీ..ఆ మార్గం చూపెట్టే వాళ్లకి కొంత విశ్వసనీయ ఉండి..అది పని కొచ్చేదనే నమ్మకం ఉంటే వేలమంది ఈ దేశంలో కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ దేశంలో తపన ఉంది.. దానికి మార్గాన్ని చూపించే బాధ్యత మనం తీసుకోవాలి. కచ్చితంగా లోక్‌సత్తా దానికి ఓ చోదక శక్తి అయింది. ఈ దేశంలో కొత్తగా రాజకీయాల గురించి ఆలోచించడం, రాజకీయాల్లో ఉన్న వాళ్లని విలన్లుగా చిత్రీకరించకుండా వ్యవస్థలో ఉన్న సమస్యను గుర్తించి పరిష్కారం సాధించడం హేతుబద్ధమైన మార్గాన్ని చూపించడం, నిర్దిష్టమైన రంగాల్లో ఏమిటి ప్రామాణికం అన్నది తీసుకురావడం కొన్ని ఫలితాల్ని సాధించడం..మూడు రాజ్యాంగ సవరణల్ని , ఏడెనిమిది పెద్ద పెద్ద చట్టాలను తీసుకు రాగలిగాం. ఎన్నో విజయాలు సాధించాం. అయితే ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని తీసుకురావడానికి ఇవన్నీ చెబుతాను కానీ జరగాల్సింది చాలా ఉంది. అయితే జరిగిన కొద్ది వాటివల్ల ఫలితాలు చాలా వచ్చాయి. రుబెల్లా వ్యాక్సిన్ వల్ల ఏడాదికి రెండు లక్షల మంది వికలాంగులుగా పుట్టకుండా ఆపగలుగుతున్నాం. దానికి విలువ కడితే మనిషి జీవితానికి ఎంత సంతృప్తి కలుగుతుంది. చాలా జరుగుతుందన్న విశ్వాసం ఉంది.. కొద్దిగా అయినా జరుగుతున్న దానికి సంతోషం ఉంది. ఇంకా చాలా జరగాలన్న స్పృహ కూడా ఉంది. అది ఉన్నప్పుడు వ్యక్తి జీవితం ఏం ఉంది. మనం ఏమీ బికారులం కావడం లేదు. తిండికి లేకుండా మలమలలాడటం లేదు. నా శక్తి, సమయం ఉపయోగిస్తే అత్యధిక ఫలితాలు ఎక్కడ వస్తాయో..అది చేస్తున్నాననే నమ్మకం ఉంది. దాన్ని కొన్ని సందర్భాల్లో రూపాయలతో వెలకట్టలేకపోవచ్చు. కానీ కచ్చితంగా అత్యుత్తమ స్థాయిలో పని జరుగుతుంది.



**"ప్రజాస్వామ్యంలో ఎప్పుడూ కూడా పౌరుల నిరంతర నిఘా చాలా ముఖ్యమని నమ్ముతాం. ఆ నిఘా లోక్‌సత్తా ఉద్యమం వల్ల పెరిగినా అది సరిపోదు. కేవలం నిరాశ, నిస్పృహల వల్లో, ఏదైనా తప్పు జరిగినప్పుడు పట్టుకోవడమో కాకుండా మనం కలిసి పనిచేయడానికి సిద్ధ పడకపోతే మనకున్న పరిమితమైన శక్తులతో మన సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఒక నిర్దిష్టమైన లక్ష్యాల కోసం వ్యూహాత్మక పథకాలు వేసుకుని ముందుకు వెళ్లనట్లయితే ఈ దేశంలో అనుకున్న ఫలితాలు సాధించలేం.**

**ఏదో ఒక సంఘటన జరిగినప్పుడు గుండెలు బాదుకోవడం కాకుండా దానికి పరిష్కారాన్ని అన్వేషించి, మార్గాన్ని చూపించినప్పుడు మాత్రమే ఫలితాలు సాధించగలుగుతాం. దానికొక మంచి మార్గాన్ని చూపించింది లోక్‌సత్తా ఉద్యమం.**

# లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మూడు దశాబ్దాల ప్రస్థానం

ఇప్పటికీ సరిగ్గా మూడు దశాబ్దాల క్రితం 1996లో డాక్టర్ జయప్రకాష్ నారాయణ గారు తమ ఐఏఎస్ పదవికి రాజీనామా చేసి ఉద్యమ ప్రస్థానంలోకి అడుగు పెట్టారు. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) అనే సంస్థను ప్రారం భించారు. ఆ తర్వాత ఉద్యమ నిర్మాణానికి కావలసిన కొంతమంది పెద్దలతో కలసి మేధోమదనం చేసి దాని ద్వారా వచ్చిన సారాన్ని ఉద్యమ సంస్థ బుక్‌లేట్ గా మార్చారు. కానీ ఉద్యమ సంస్థకు పేరు లేకపోతే అది ప్రజల్లోకి వెళ్ళడానికి ఇబ్బంది అవుతుందని ఉద్యమ సంస్థకు పేరు నిర్ణయించడానికి 1997లో హైదరాబాదులోని బిర్లా సైన్స్ సెంటర్ ఆడిటోరియంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో భావ సారూప్యత ఉన్న వారందరినీ చేర్చి ఒక సమావేశం నిర్వహించారు. ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ అనే పేరు ఉద్యమ సంస్థకి బేస్ లైన్ అయినా కూడా పలకడానికి సులభంగా ఉండాలి, ఎక్కువమందికి చేరేదిగా ఉండాలనే ఉద్దేశంతో పేరు నిర్ణయం మీద గ్రూప్‌ల వారి చర్చ నిర్వహించారు. ఎక్కువ మంది "జనబలం" అనే పేరును సూచించారు. ప్రజా బలానికి నిదర్శనంగా ఉంటుందని చాలా మంది భావించారు. కానీ కేవలం తెలుగు ప్రాంతాలలో మాత్రమే ఇది ప్రచారం అవుతుంది కానీ దేశవ్యాప్తంగా వివిధ భాషలు మాట్లాడే వారికి కూడా అర్థమయ్యే విధంగా ఎక్కడైనా సరే ఈ పేరును ఉపయోగించుకునేలా ఉండాలని మరో ఆలోచన వచ్చింది దానిలో భాగంగా "లోక్‌సత్తా" అనే పేరు రెండో స్థానంలో నిలిచింది. లోక్ అంటే "జనం".. "సత్తా" అంటే బలం తెలుగులో కొంచెం అటు ఇటుగా మారిస్తే అదే అర్థం వస్తుంది కనుక చివరికి "లోక్‌సత్తా" అనే పేరు సంస్థకు ఖరారైంది. కానీ ఎక్కువమంది అంగీకరించిన జనబలం అనే పేరును ఏం చేద్దామని ఆలోచన వచ్చినప్పుడు ఉద్యమ సంస్థ తరఫున ప్రతి నెలా ఒక న్యూస్‌లెటర్ తీద్దామనుకుని దానికి జనబలం అనే పేరు ఖరారు చేశారు. ఆ పత్రికకు మొట్టమొదటి ఎడిటర్‌గా ఆనాటి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి విష్ణు బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం గత 29 సంవత్సరాలుగా మనం చదువుతున్న ఈ వ్యాసం ప్రింట్ అయిన పత్రిక పేరే "జనబలం."

ఉద్యమ సంస్థ పేరు ఖరారు కాగానే దానికి అవసరమైన బేస్‌లైన్ సాహిత్యం ప్రింటింగ్ మొదలైంది. అందులో భాగంగానే లోక్‌సత్తా "రెండవ స్వతంత్ర పోరాటం"అనే పుస్తకాన్ని ప్రచురించారు అందులో లోక్‌సత్తా ప్రజా సంఘాల సంస్థగత నిర్మాణం కోసం నిబంధనలు వివరాలు ప్రచురితమయ్యాయి. లోక్‌సత్తాలో చేరడానికి అర్హతలు అనర్హతలు అలాగే జీవిత సభ్యత్వం వివరాలు పొందుపరిచారు. "స్వచ్ఛమైన పాలన కోసం ఆవిర్భవించిన ప్రజాస్వామ్య ఉద్యమం"గా టాగ్‌లైన్ తో ఆ పుస్తకం ప్రింట్ అయింది.




"లోక్‌సత్తా"లో చేరాలంటే భారతీయ పౌరుడై ఉండాలి. 18 సంవత్సరాలు నిండి ఉండాలి. వారు ఏదైనా రాజకీయ పార్టీలో సభ్యత్వం ఉంటే కూడా లోక్‌సత్తా లో చేరడానికి అభ్యంతరం లేదు. కానీ లోక్‌సత్తా తరఫున ఏర్పాటయ్యే ప్రజా సంఘాలలో వారికి పదవులు ఉండవు. ఏదైనా రాజకీయ పార్టీలో పదవులు ఉంటే లోక్‌సత్తాలో చేరడానికి వీలు లేదు. ఇది ప్రాథమిక నిబంధన.ఆ తర్వాత గ్రామాల, వార్డుల పట్టణాల వారి ప్రజా సంఘాలు ఏర్పాటు చేసుకోవడానికి సంస్థాగత నిర్మాణం చేపట్టారు. ప్రతి ప్రజా సంఘంలో పదిమంది వరకు సభ్యులు ఉండి అందులో సమన్వయకర్తగా ఎన్నికైన ఒకరికి బాధ్యత అప్పజెప్పారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి , సహాయ కార్యదర్శితో పాటు కోశాధికారి పదవులు మూస పద్ధతి కనుక వాటిని





మినహాయించారు. మిగతా అందరూ కార్యవర్గ సభ్యులుగా ఉంటారు. ఇలా రాష్ట్రమంతా ప్రజాసంఘాల నిర్మాణం గ్రామాల పట్టణాల మండలాల వారీగా జరిగింది.

లోక్‌సత్తాలో మరొక విశేషం ఏమిటంటే అధ్యక్ష కార్య దర్శులు అనే పదవులకు భిన్నంగా తెలుగులో "సమన్వ యకర్త" ఇంగ్లీషులో "కోఆర్డినేటర్" అనే పదవులనే ఖరారు చేశారు. ఎంత ఎక్కువ మంది సభ్యులకి అన్ని ప్రజాసంఘాల ఏర్పాటుకు అనుమతించారు.

ఇక సంస్థాగత నిర్మాణం పూర్తయిన తర్వాత సభ్యులకు కొన్ని మార్గదర్శకాలు కూడా రూపొందించారు. ఎక్కడా ప్రజా సంఘాల పేరుతో లోకసత్తా పేరును ఉపయోగించు కొని పైరవీలు చేయరాదు. సమస్యలలో ఉన్న పౌరులను గుర్తించి వారి ద్వారానే ఉద్యమ రూపకల్పన పోరాటాలు చేయాలని సూచించారు. ఎవరికైతే కడుపునొచ్చిందో వారే మందు మింగాలి లోక్‌సత్తా కేవలం డాక్టర్ పాత్ర వహించాలి తప్ప వారి సమస్యలకు మేము పరిష్కారం చూపిస్తాం అని రాజకీయ పార్టీలలాగా ప్రవర్తించకూడదు అని తీర్మా నించారు.

**లోక్‌సత్తా ఇది మీ సత్తా!!!.**

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రధాన ట్యాగ్ లైన్ "ప్రజలే ప్రభువులు" ఆ తర్వాత 2006లో లోక్‌సత్తా పార్టీ ప్రారంభించిన తర్వాత "ప్రజలే ప్రభువుల"కు తోడు "పాలకులు సేవకులే" అనే అంశాన్ని కూడా చేర్చాము. రాష్ట్రమంతా లోక్‌సత్తా ప్రజా సంఘాల నిర్మాణానికి ప్రచారం మొదలైంది. అందులో భాగంగా "లోక్ సత్తా ఇది మీ సత్తా" అని ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున ద్వారా టీవీలలో రేడియోలలో ప్రకటనలు మొదలయ్యాయి. ఆ ప్రచారం ఉద్యమ సంస్థ ప్రజలలోకి విస్తృతంగా వెళ్లడానికి లోక్ సత్తాకు ఎంతో ఉపయోగపడింది. ఈ కృషి వెనక నాగార్జున అన్నగారైన వెంకట్ అక్కినేని ఉన్నారు. ఈ ప్రచార వ్యాప్తికి ఆయన విశేష కృషి చేశారు. ఆ తర్వాత రాష్ట్రంలో దేశంలోని అనేకమంది ప్రముఖులు లోక్‌సత్తా ఉద్యమానికి ఊతమిస్తూ కొందరు చేరారు.. మరికొందరు బయట నుంచి మద్దతు ఇచ్చారు. వీరిలో సీనియర్ ఐఏఎస్ అధికారి కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌గా పనిచేసిన బిపిఆర్ విఠల్, అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అంబటి లక్ష్మణరావు, మరో ఐఏఎస్ అధికారి చక్రధర్, ప్రముఖ రచయిత్రి బీమాదేవి ఆకాశవాణి లో సీనియర్ అనౌన్సర్ , రచయిత్రి తురగా జానకిరాణి ఇలా ఎంతోమంది లోక్ సత్తాకు ప్రత్యక్ష పరోక్ష మద్దతు ఇచ్చారు.

**లోక్ సత్తా మొదటి ప్రజా ఉద్యమం**

**పెట్రోలు డీజిల్ కల్తీ తప్పుడు కొలతలకు వ్యతిరేకంగా..**

ఉద్యమ సంస్థ మొదలైంది కానీ కార్యాచరణ లేకుండా ప్రజలలోకి వెళ్లకుండా కేవలం సూక్తి ముక్తావళి చెబితే లాభం లేదు కదా అందుకే ఒక కార్యాచరణ రూపొందిం చడానికి మరొక సంవత్సరం పట్టింది. 1998లో పెట్రోల్ బంకులలో పెట్రోల్ కల్తీ తూనికలలో మోసం గురించి ఒక ప్రత్యక్ష ఉద్యమాన్ని లోకసత్తా ప్రతిపాదించింది. అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కేవలం 1500 పెట్రోల్ బంకులు మాత్రమే ఉండేవి . అందులో జిల్లాకు ఒకటి రెండు చొప్పున మొత్తం సుమారు 50 పెట్రోల్ బంకులలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నాయకులు కార్యకర్తలు పెట్రోల్ డీజిల్ కల్తీ తూనికల మోసం గురించి ప్రత్యక్ష తనిఖీలు నిర్వహించారు. అందులో మనం పెట్రోలు పోయించడానికి వెళ్ళినప్పుడు మన స్కూటర్ లేక కారులో ఇంధనం పోయించు కుంటా ము కానీ కొలతల్లో తేడా వచ్చిందని గమనించడానికి అట్లా కష్టం కనుక పెట్రోల్ బంక్ వారు ముఖ్యంగా ఒక లీటరు, ఐదు లీటర్ల క్యాన్లు పెట్రోల్ బంక్‌లో రూల్స్ ప్రకారం ఉంచాలి. ఒక లీటర్ లో 50 ఎంఎల్ తేడా వచ్చిందనుకోండి గుర్తించవచ్చు కానీ 10 లేక 20 మిల్లీలీటర్ల తేడా గుర్తిం చడం కష్టం కనుక ఐదు లీటర్ల క్యాన్లు ఉపయోగించుకుంటే 50 ఎంఎల్ మోసం చేసినా కూడా పావు లీటర్ తక్కువగా కనబడుతుంది. అలా ఈ మోసాన్ని అరికట్టే క్రమంలో అద్భుతమైన కృషి చేసిన లోక్‌సత్తా కార్యకర్తలు ఆ మోసాన్ని







ప్రజల ముందు ఉంచారు. అలాగే పెట్రోల్ డీజిల్‌లో కల్తీ కూడా పట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరచి తూనికలు కొలతల శాఖ వారు మిగతా అన్ని బంకుల మీద దాడి చేస్తూ ప్రారంభించిన ఉద్యమానికి ఊతమిస్తూ తూనికలు కొలతల మోసాన్ని అరికట్ట కలిగారు. దీంతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఒక సంవత్సరంలో వందల కోట్ల రూపాయల ఆదా జరిగింది. ఇది లోక్ సత్తా ఉద్యమ సంస్థకు మొదటి విజయం.

ఆ తర్వాత "స్వరాజ్యం" అనే ఒక పుస్తకాన్ని ప్రచురించి సుపరిపాలన (గుడ్ గవర్నెన్స్) లో ఏముండాలి అలాగే పౌర సేవలను మనం ఎలా అందుకోవాలి. దానికి కావలసిన నిబంధనలు ఏమిటి అనే విషయంలో ప్రజలకు వివరించడానికి ఒక పుస్తకాన్ని రిలీజ్ చేశారు. అప్పటి గవర్నర్ రంగరాజన్‌గారు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు రేషన్ కార్డు పొందడం నుండి పట్టాదారు పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, భూములు ఆస్తులు అమ్మకం కొనుగోలుపై రిజిస్ట్రేషన్ రూల్స్ గురించి కూడా ఇలా అనేక పౌర సేవల గురించి ఆ పుస్తకంలో వివరించాము.

ఆ పుస్తకంలోని విషయాలను అనేకమంది పత్రిక విలేకరులు మార్గదర్శి అనే శీర్షికన తమ తమ పత్రికలలో అవే వ్యాసాలను యథాతథంగా మరొకసారి తిరగరాశారు. అలా కూడా ప్రజలకు బహుళ ప్రచారం పొందిన పత్రికల ద్వారా పౌర సేవల వివరాలు లభించాయి. లంచం లేకుండా పౌర సేవలు పొందడానికి ఇవి సహకరించాయి.

**అవినీతి అంతం... లోక్ సత్తా పంతం**

అధికారుల అవినీతికి సహకరించే రాజకీయ అవినీతి దానికి పునాది వంటిది. ఎన్నికల వ్యవస్థలో లోపాలను సవరించే క్రమంలో ఎన్నికలలో డబ్బు, మద్యం పంపిణీకి వ్యతిరేకంగా ప్రజలను లోక్‌సత్తా ఉద్యమ సంస్థ చైతన్య పరిచింది. దేశంలో అవినీతికి మూలాలు రాజకీయాల్లో ఉన్నాయని రాజకీయాలు మారకుండా అవినీతి నిర్మూలన సాధ్యం కాదని లోక్ సత్తా నినదించింది.

ప్రజాస్వామ్య, రాజకీయ, ఎన్నికల సంస్కరణలు, రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం పెంపొందించడం, పోలీసు, న్యాయ సంస్కరణల విషయంలో అనేక చైతన్య కార్యక్రమాలు లోక్‌సత్తా నిర్వహించింది. ఈ ఉద్యమాలకు అవసరమైన చైతన్యాన్నిచ్చే సాహిత్యాన్ని కూడా ఎప్పటికప్పుడు ప్రచురించింది.

**విషయ పరిజ్ఞానం- సంఘటితం- ఉద్యమం**

విషయ పరిజ్ఞానం లేకుండా సంఘటితమై ఉద్యమిస్తే తప్పులు జరుగుతాయి. కనుక ఏ ఉద్యమమైనా మొదలు పెట్టే ముందు విషయపరిజ్ఞానంతో ఆలోచించి దాన్ని ఉద్యమ రూపంగా మలచడానికి ప్రజలను సంఘటితం చేయడం అనేది లోక్‌సత్తా ఆచరణాత్మక దృక్పథంగా సాగింది. అందుకే లోక్ సత్తా నిర్వహించే ప్రతి కార్యక్రమంలో వెనుక ఉండే బ్యానర్ లో విషయ పరిజ్ఞానం- సంఘటితం- ఉద్యమం. అనే మాటలు ట్యాగ్ లైన్ గా ఉండేవి.

**ఎలక్షన్ వాచ్, ఎన్నికల నిఘా కార్యక్రమం**

ఆ తర్వాత 1999 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల నిఘా వేదిక ఏర్పాటు చేశాము. ఎన్నికలలో ఓటు హక్కు ప్రాముఖ్యత, దొంగ ఓట్ల నిర్మూలన, టెండర్ ఓటు, చాలెంజ్ ఓటు, ఎలా వేయాలి అనే అంశాలను తీసుకొని ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాల గురించి అన్యాయాల గురించి ప్రజలకు వివరించడం వాటి మీద ఉద్యమాలు చేయించాము. అందులో భాగంగానే ఎన్నికల నిఘా ఉద్యమం శిక్షణా తరగతులు నిర్వహించాము.

**నేరచరితుల గుర్తింపు ప్రకటన**

వివిధ పార్టీల తరఫున అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారి నేర చరిత్రను దేశంలో మొట్టమొదటిసారిబయటపెట్టిన ఉద్యమ సంస్థగా లోక్‌సత్తా నిలిచింది. అప్పుడు 46 మంది నేర చరిత్ర గురించి బహిరంగంగా ప్రకటించింది. నిష్ణాతులైన ఐపీఎస్,ఐఏఎస్ అధికారుల అండతో ఆయా అభ్యర్థులపై వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్న కేసులు, కోర్టులలో పెండింగ్ లో ఉన్న కేసులు శిక్ష పడిన కేసులతో సహా పకడ్బందీ





సాక్షాలతో అభ్యర్థుల నేరచరిత్ర బయటపెట్టింది. సాధారణ మీడియా చేయలేని పనిని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ అద్భుతంగా చేసింది. ఈ విషయంలో రాజకీయ పార్టీల నుండి మంచి స్పందన వచ్చింది. మీరు బయటపెట్టిన నేర చరిత్రల సంగతి సరే కానీ ఇంకా చాలామంది నేరచేతులు వేరే పార్టీలలో కూడా ఉన్నారు కదా వారి గురించి ఎందుకు బయట పెట్టలేదు అనే ప్రశ్న రాజకీయ పార్టీల నుంచి వచ్చింది. అయ్యా వారి గురించి కూడా వివరాలు ఇవ్వండి వారిని కూడా బయటపెడతామని ఆయా రాజకీయ పార్టీలకు లోక్‌సత్తా సవినయంగా సమాధానం చెప్పింది.

**సమస్య వర్ణన కాదు పరిష్కారం కావాలి**

సమస్య వర్ణన కాదు పరిష్కారం కావాలనే విధంగా ప్రతి సమస్యకు అంతకంటే తక్కువ సమస్యలున్న పరిష్కారాన్ని లోక్ సత్తా సూచించింది. రోజువారి రొటీన్ ఉద్యమాలకు రొటీన్ వార్తలకు విరుద్ధంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆయా సందర్భాలలో సమాజంలో ఉన్న అన్యాయాలపై అక్రమాలపై ఎలుగెత్తి చాటి పత్రికల వారికి కూడా ఒక ఫీడ్ బ్యాక్ ఇచ్చింది.

**ప్రజలే ప్రభువులు- పాలకులు సేవకులే అన్న లోక్‌సత్తా ఎలుగెత్తి చాటిన నినాదం సాంప్రదాయ రాజకీయ పార్టీలు కూడా తమ తమ సమావేశాలలో అనివార్యంగా అనేటట్లు లోక్ సత్తా ఉద్యమ సంస్థ ప్రేరేపించింది.**

**దేశమును ప్రేమించుమన్నా**
**అవినీతి వ్యతిరేక ఉద్యమం**

దేశమును ప్రేమించుమన్నా అనే ట్యాగ్ లైన్ తో 14 నవంబర్ చాచా నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా అవినీతికి వ్యతిరేకంగా అనేక కళాశాలలు పాఠశాలల్లో ప్రతిజ్ఞలు చేయించింది. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో విద్యార్థినీ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ అవినీతి వ్యతిరేక ఉద్యమం ఉధృతంగా సాగింది.

**యువతా మేలుకో దేశాన్ని ఏలుకో**

యువతా మేలుకో దేశాన్ని ఏలుకో అంటూ యువతకు ఒక ఉద్యమ రూపం ఇచ్చింది. ఆలోచించే పెద్దతరం ఆవేశపడే యువతరాన్ని కలుపుతూ ఆలోచనం ఆవేశం= లోక్ సత్తా ప్రజాస్వామ్య ఉద్యమంగా పేర్కొంది.

మహిళా సమస్యలపై ఒకటేమిటి సమాజంలో అనేక సమస్యలపై లోక్‌సత్తా ఉద్యమం చక్కని పరిష్కారాలను సూచించింది.

**సమాచార హక్కు ఉద్యమం**

2002 నుంచి సమాచార హక్కు ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ప్రేరేపించింది. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సమావేశాలు సభలు నిర్వహించింది. 2002లో ఢిల్లీలో సమాచార స్వేచ్ఛ చట్టం వస్తే అది సరిపోదని సమాచార హక్కు చట్టం రావాలని పార్లమెంటు, అసెంబ్లీ సభ్యులకు ఏ సమాచారమైతే అందుబాటులో ఉంటుందో ఆ సమాచారం పౌరుల హక్కుగా ఉండాలని సమాచార హక్కు ఒక బ్రహ్మాస్త్రంగా లోక్‌సత్తా ఉద్యమించింది. ప్రభుత్వ అధికారులు రాజకీయ నాయకుల గుప్పిట్లో ఉన్న సమాచారాన్ని ప్రజల ముందుకు తెచ్చే సమాచార హక్కు చట్టాన్ని సాధించాము. సమాచారమే ఆయుధం.. సమాచారమే ఉద్యమం అనే విధంగా 2005లో సమాచార హక్కు చట్టం రావడానికి లోక్‌సత్తా కృషి చేసింది. అంతటితో ఆగలేదు ఆ తర్వాత సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి జూబ్లీహిల్స్ లో ఉన్న సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ మర్రి చెన్నారెడ్డి మానవనరుల శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో పౌర సమాజానికి, ప్రభుత్వ అధికారులకు, జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. దానికి కావలసిన సాహిత్యాన్ని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వారితో కలసి తయారు చేసి విస్తృతంగా పంచింది. ప్రభుత్వ అధికారులకు శిక్షణ బాధ్యతలు ప్రభుత్వ అధికారులు తీసుకుంటే, జర్నలిస్టులకు ఆనాటి ప్రెస్ అకాడమీ తరఫున మన జన బలం పత్రిక వర్కింగ్ ఎడిటర్ డి సోమసుందర్ బాధ్యత తీసుకున్నారు. తన జర్నలిస్టు మిత్రులతో కలిసి జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు. అలాగే పౌర సమాజానికి శిక్షణ ఇవ్వడానికి నాతో పాటు అప్పటి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి ఎస్ వర్మ , కార్యదర్శి భండారి అంకయ్య గారు ఇతర మిత్రులు అందరం కలిసి సమాచార హక్కు చట్టం గురించి

## ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రారంభం నుండి 2006 వరకు పనిచేసిన లోకసత్తా ఉద్యమ సంస్థ జిల్లా నాయకులు కార్యకర్తలను వారు చేసిన సేవలను లోక్ సత్తా ఉద్యమ సంస్థ మూడు దశాబ్దాల ప్రస్థానం సందర్భంగా ఒకసారి జ్ఞాపకం చేసుకుందాం.

**లోక్‌సత్తా ఉద్యమ సంస్థ పునాదిరాళ్లు వీరే**

**శ్రీకాకుళం జిల్లా:** రోణంకి ఆనందరావు గారు, శాస్త్రి గారు, విష్ణుమూర్తి గారు.

**విజయనగరం జిల్లా:** భీశెట్టి బాబ్జి గారు. తనదైన రీతిలో ఉద్యమ నిర్మాణానికి కృషి సల్పుతున్నారు.

**విశాఖపట్నం జిల్లా:** ప్రొఫెసర్ ప్రసాద్ రావు గారు, ఎం వీఎస్ రాయ్ గారు.

**తూర్పుగోదావరి జిల్లా:** తటవర్తి శ్రీనివాసరావు గారు ఉద్యమ సంస్థను ప్రారంభించారు. ప్రముఖ డాక్టర్, ఆలూరి విజయలక్ష్మిగారు, డాక్టర్ పాలడుగు చంద్రమౌళి గారు, వైడీ రామారావు గారు, సిద్ధార్థ భక్షి గారు, జగన్నాథరావు గారు, డాక్టర్ సుబ్రహ్మణ్యంగారు, మాచి రాజు గారు.

**పశ్చిమగోదావరి జిల్లా:** డాక్టర్ సత్య నారాయణ మూర్తి గారు ఆ తర్వాత టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జి.జానకి రామరాజు గారు ఎంతోమందిని లోక్‌సత్తా ఉద్యమ సంస్థలోకి ఆహ్వానించారు. ఉద్యమ సంస్థను తర్వాత లోక్‌సత్తా పార్టీని 20 సంవత్సరాల పాటు తన మార్గ దర్శకత్వంలో నడిపిన డీవీవీఎస్‌వర్మగారు, ఎస్. జానకి రామరాజు, మనోరమ, అనేక ప్రజా ఉద్యమాల లో పాల్గొం టున్న జనబలం ఎడిటర్ సోమసుందర్ గారు కూడా ఆ జిల్లాకు చెందిన వారే .

**కృష్ణాజిల్లా:**డాక్టర్ పట్టాభి రామారావు గారు, బసవేశ్వర రావు గారు, శాంతిరెడ్డి గారు, ఎస్ఆర్ పరిమిగారు.

**గుంటూరు జిల్లా:** బసవ పున్నారావు గారు, కొండా శివ రామిరెడ్డి గారు, డాక్టర్ అరవింద్,సూర్యగారు,న్యాయవాది భాను ప్రసాద్‌గారు,ఐరామ్మూర్తి గారు, రాఘవరావు గారు.

**ప్రకాశం జిల్లా:** పురుషోత్తం గారు.

**నెల్లూరు జిల్లా :** బాబూరావు, రామారావుగారు.

**చిత్తూరు జిల్లా:** కృష్ణయ్య గారు, జనార్ధన నాయుడుగారు, ఎల్ శ్రీనివాసులు గారు, లోకేష్ గారితో పాటు యువ మిత్రులు అనేకమంది పని చేశారు.

**కడప జిల్లా:** రాజుగారు, వేణుగోపాల్ గారు, కృష్ణ గారు.

**అనంతపురం జిల్లా :** సురేష్, డాక్టర్ శ్రీనాథ్ గారు, డాక్టర్ కొండయ్య గారు .

**కర్నూలు జిల్లా:** విద్యావేత్త రామకృష్ణారెడ్డి గారు, న్యాయవాది జగన్నాథ రెడ్డి గారు, ఎల్లయ్య గారు, డాక్టర్ పద్మన్న గారు, న్యాయవాది వసంత్ గారు, జేవి వెంకటేష్ గారు.

**తెలంగాణ జిల్లాలలో ఉద్యమ సంస్థ పునాదిరాళ్లు**

**మహబూబ్ నగర్ జిల్లా:** సంజీవ రాయుడు గారు, రాము గారు, అక్కినేని నారాయణరావు గారు, నరసింహారావు గారు, ప్రసాద్ గారు, నటరాజ్ గారు. మక్తల్ పట్టణం నుండి అప్పటినుండి ఇప్పటికీ అంతే ఉత్సాహంతో పని చేస్తున్న నారాయణ గారు.

**రంగారెడ్డి జిల్లా:** నందిపేట రవీందర్ గారు, కటారి శ్రీనివాసరావు గారు, జగన్నాథరావు గారు.

**హైదరాబాద్ జిల్లా:** డాక్టర్ చెలికాని రావు గారు, ఉప్పల గోపాలరావు గారు. (ప్రజాఆలోచన వేదిక సంస్థ), బం డారు రామ ఫణిధర్ గారు. ఎం. పద్మనాభరెడ్డిగారు(ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్), ఎస్.భగవాన్లుగారు.

**నల్లగొండ జిల్లా:** మోహన్ రెడ్డి గారు,ఫాదర్ రఫెల్ గారు. ,టీఎల్ నరసింహారావు గారు, డాక్టర్ రామయ్య గారు, పాండు రంగారావు గారు, కాచరాజు జయ ప్రకాష్ రావు గారు, దిడ్డి బాలాజీ గారు, జంపాల అంజయ్య గారు, మధుసూదన రావు గారు.

**ఖమ్మం జిల్లా:** చారుగుండ్ల వెంకటేశ్వర్లు గారు.

**వరంగల్ జిల్లా:** పర్చా కోదండ రామారావు గారు, మీనేశ్వర రావు గారు.

**కరీంనగర్ జిల్లా:** భండారి అంకయ్యగారు, శ్రీనివాస్ గారు, రాజమౌళి గారు, శాంతి ప్రకాష్ శుక్లా గారు, పందిళ్ళ శంకర్ గారు

**మెదక్ జిల్లా:** బండారు రామ్మోహనరావు గారు, డాక్టర్ రంగాచారి గారు, తుమ్మనపల్లి శ్రీనివాస్‌గారు, శ్రీనివాసా చారి గారు, గోవర్ధన్ గారు

**నిజామాబాద్ జిల్లా:** మారుతి గారు, కళా లలితగారు, వాసుదేవరావు గారు, రమేష్‌గారు, శ్యాంగోపాల్ గారు .

**అదిలాబాద్ జిల్లా:** డాక్టర్ సత్యనారాయణ రెడ్డిగారు, డాక్టర్ వాసిరెడ్డి మధు గారు, పెద్దపల్లి కిషన్ రావు గారు, డాక్టర్ నగేష్ గారు, రామ్‌శెట్టి బాబు గారు, గోపీకిషన్‌గారు , ఒల్లాల కిషన్ రావుగారు, ప్రసాద్ రెడ్డిగారు, రాజశేఖర్ గారు, పాపేశ్వర శర్మ గారు, రాజశేఖర్‌గారు, గడప శ్రీహరి గారు, అబ్దుల్ గఫ్ఫార్ గారు

ఉద్యమ సంస్థ ప్రారంభమైన తర్వాత మొదటి రెండేళ్లలో వీరందరూ ఆయా జిల్లాల్లో లోక్‌సత్తా ఉద్యమ విస్తరణలో పునాదిరాళ్లుగా ఉన్నారు. ఇందులో చాలా మంది కీర్తిశేషులు అయ్యారు. అలాంటి ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు సమర్పిస్తూ ఎవరినైనా మరిచిపోయి పేరు రాయకపోయి ఉంటే మన్నించాలి.






రాష్ట్రవ్యాప్తంగా శిక్షణా తరగతులు నిర్వహించాం.

**అసర్ విద్యా కార్యక్రమం**

యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 650 గ్రామీణ జిల్లాలలో ఒకటి నుండి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థినీ విద్యార్థుల అభ్య సనా సామర్థ్యాలను గమనించడానికి సర్వే చేయడానికి ప్రథమ్ సంస్థ వ్యవస్థాపకులు మాధవ్ చౌహాన్ తో కలిసి అసర్ సర్వే ప్రోగ్రాం చేపట్టాము. దానికి అవసరమైన శిక్షణా తరగతులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాము . దేశ వ్యాప్తంగా మిగతా రాష్ట్రాలలో నాలుగైదు సంస్థలు కలిస్తే తప్ప ఆయా రాష్ట్రాలలో అసర్ కార్యక్రమం జరగలేదు. కానీ ఆనాడు ఉమ్మడి రాష్ట్ర అసర్ సమన్వయకర్తగా డాక్టర్ జయ ప్రకాశ్ నారాయణ గారు నాకు బాధ్యతలు అప్పగించారు. 2004 నుండి2006 వరకు అసర్ రాష్ట్రస్థాయి సమన్వయ కర్తగా నేను పని చేశాను. ఆంధ్రప్రదేశ్‌లో 23 జిల్లాలలో అసర్ సర్వే విజయవంతంగా నిర్వహించిన ఘనత లోక్ సత్తా ఉద్యమ సంస్థదే. ఆ శిక్షణలో నాతో సహకరించిన సోమ సుందర్‌తో పాటు ప్రతి జిల్లా అసర్ కోఆర్డినేటర్ సహ కారం వల్ల అలాంటి బృహత్కార్యం సాధ్యమైంది. ఇప్పటికీ అసర్ ప్రోగ్రాంలో నేను సోమసుందర్ పాల్గొంటున్నాము.

**స్థానిక ప్రభుత్వాల సాధికారత ఉద్యమం.**

**ఇంటి ముందు పాలన- కంటి ముందు ప్రభుత్వం**

మునిసిపాలిటీలు కార్పొరేషన్లు పట్టణ స్థానిక ప్రభుత్వాల నుండి మొదలుకొని గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ వరకు ఉన్న మూడంచెల స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం" స్థానిక ప్రభుత్వాల సాధికారత" ఉద్య మాన్ని 2003లో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రారంభించింది. ఆ ఉద్యమంలో వివిధ పార్టీల నుండి క్రియాశీలంగా ఉన్న అనేకమంది రాజకీయ నాయకులు మాతో కలసి పని చేశారు. అందులో ముఖ్యంగా చెప్పుకోదగ్గ వ్యక్తుల్లో పంచా యతీ సభ్యుడు సర్పంచ్, సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్యే, పార్ల మెంటు సభ్యుడి దాకా గల్లీ నుండి ఢిల్లీ దాకా పనిచేసిన తెలుగుదేశం పార్టీ నుండి ఎన్నికైన అప్పటి రాజ్యసభ మాజీ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి , హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే కేతిరి సాయి రెడ్డి , కడప జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన తులసిరెడ్డి ఇలా పదుల సంఖ్యలో ప్రముఖ రాజకీయ నాయకులు స్థానిక ప్రభుత్వాల సాధికారత ఉద్యమంలో మాతో కలిసి నడిచారు.

**కోటి సంతకాల సేకరణ ఉద్యమం**

73,74వ రాజ్యాంగ సవరణల ద్వారా సంక్రమించిన అధికారాలు పూర్తిగా బదలాయించాలని పంచాయతీలకు 29 అంశాలు మునిసిపాలిటీలకు 18 అంశాలు వెంటనే బదిలీ చేయాలని స్థానిక ప్రభుత్వాలకు సిబ్బంది,విధులు నిధులు అధికారాల కోసం నినదిస్తూ , ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వాల ప్రజా ప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రజలచే కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభిం చాము. కేవలం 60 రోజులలోనే రాష్ట్రమంతా ఒక కోటి తొమ్మిది లక్షల సంతకాలు సేకరించి అద్భుతమైన బహిరంగ సభను మన హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ లోని లలిత కళాతోరణంలో నిర్వహించాము. కోటి సంతకాల సేకరణకు సహకరించిన ప్రజా ప్రతినిధులు లోక్ సత్తా ఉద్యమ సంస్థ కార్యకర్తలు నాయకులను ఘనంగా సన్మానించుకున్నాము. అలాగే స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం ప్రభుత్వాలు చేయాల్సిన పనుల కోసం వినతి పత్రాన్ని తయారుచేసి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నాయకుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి లను కలిసి వారికి సమర్పించాము. అలాగే వివిధ రాజకీయ పార్టీల వారికి కూడా స్థానిక ప్రభుత్వాల సాధికారత ఉద్యమం డిమాండ్ చేసిన అంశాలను రాతపూర్వకంగా అందించాము.

లోక్‌సత్తా ఉద్యమ స్ఫూర్తితో అనేక ఉద్యమాలు వస్తున్నా కూడా అంత పరిపక్వంగా విషయ పరిజ్ఞానంతో రావడం లేదనే బాధ మనలాంటి వాళ్ళందరి కి తొలుస్తూనే ఉంటు ంది. అదొక స్వర్ణ యుగం ఆనాటి ఉద్యమ అనుభవాలు ఎంత రాసేనా తక్కువే అయినా నాకు జ్ఞాపకం ఉన్నంతవ రకు మీకు అందించాను.

**-బండారు రామ్మోహనరావు**
**(లోక్‌సత్తా ఉద్యమ సంస్థ**
**ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త)**

# ప్రజలే ప్రభువులుగా..!

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు.. ఈ మాటే ప్రజాస్వామ్యానికి మూలం. మన రాజ్యాంగ పీఠికలో "భారతదేశ ప్రజలమైన మేము……ఈ 1949 నవంబరు 26వ తేదీన, ఈ రాజ్యాంగాన్ని ఆమోదించి, శాసించి, మాకు మేమే సమర్పించుకుంటున్నాము. అని పేర్కొనడం ద్వారా ఈ దేశం ప్రజలది అని చెప్పుకున్నాము. కానీ ఆ వాక్యాలు కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రజలు కేవలం ఓటు వేసే బానిసలుగా, ఆ ఓటుతో ఎన్నికైన వాళ్ళు రాజులుగా మారారు. వేలాది మంది త్యాగాలతో మనం సాధించుకున్న స్వాతంత్ర్యం ఫలితం కేవలం తెల్లదొరలు పోయి నల్లదొరలు రావడమే అని అర్థం అవుతున్న దశలో.. మన రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ప్రజాస్వామ్యం ఇది కాదు, పరిపాలన పేరుతో సాగుతున్నది రాజ్యాంగబద్ధ దోపిడీ, చట్టబద్ధ చౌర్యం అంటూ, ఈ వ్యవస్థను సంపూర్ణంగా మార్చి, మనదేశంలో ప్రజలే ప్రభువులుగా ఉండే నిజమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలనే గొప్ప ఆశయంతో డా.జయప్రకాశ్ నారాయణ్ గారి ఆలోచనలతో పురుడుపోసుకుంది లోక్ సత్తా ఉద్యమం.

1997 ఆగస్ట్ 3వ తేదీ ఆదివారం, హైదరాబాదులోని బిర్లా సైన్స్ సెంటర్ ఆడిటోరియంలో లోక్‌సత్తా ఆవిర్భావ సభ జరిగింది. పాకిస్తాన్‌తో యుద్ధంలో పాల్గొన్న మాజీ ఎయిర్ చీఫ్ మార్షల్ లతీఫ్, స్వాతంత్ర్యసమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య లాంటి మహామహుల సమక్షంలో ఆంధ్రప్రదేశ్ లోని 23 జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులతో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రారంభం అయింది. ఈ ఆగస్ట్ 3 తో లోక్ సత్తా 30వ ఏట అడుగుపెడుతోంది. ఈ ముప్పై ఏళ్ల ప్రయాణాన్ని కేవలం గుర్తు చేయడమే కాదు, ఒకసారి సమీక్షించుకోవడం ఈ వ్యాసం లక్ష్యం.

లోక్‌సత్తాకు దేశవ్యాప్తంగా గొప్ప పేరుని తీసుకురావడమే కాకుండా, దేశంలో ఒక పెద్ద సంస్కరణకు నాంది పలికిన ఉద్యమం ఎన్నికల నిఘా ఉద్యమం. 1999 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నేర చరిత్రను ప్రజల ముందు పెట్టడమే కాకుండా, నేరచరితులకి టికెట్లు ఇవ్వొద్దు అని పార్టీలపై వత్తిడి తెచ్చింది లోక్ సత్తా. అయితే, ఈ ఉద్యమం ఫలితంగా, ఆ ఉద్యమం కొనసాగింపుగా సుప్రీం కోర్టులో జరిగిన న్యాయపోరాటం కారణంగా, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, తమ ఆస్తులు, అప్పులు, నేర చరిత్రను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఆ తీర్పుని నీరుగారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ ని తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. ఆ ఆర్డినెన్స్ పై సంతకం పెట్టొద్దు అంటూ, అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాంని జేపీగారి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు కలిసి విజ్ఞాపన పత్రం ఇచ్చారు. ఇలాంటి అనేక ప్రయత్నాల తర్వాత ఈ నిబంధన అమలులోకి వచ్చింది.

దేశ చరిత్రలో తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేసే అన్ని పార్టీల అభ్యర్థులను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి, ప్రజలతో ముఖాముఖి నిర్వహించే కార్యక్రమానికి కూడా లోక్ సత్తా అప్పుడే శ్రీకారం చుట్టింది. ఆ ఉమ్మడి వేదికల సంప్రదాయాన్ని 2009 వరకు ప్రైవేట్ న్యూస్ ఛానల్స్ కొన సాగించాయి.

ఎన్నికల నిఘా ఉద్యమంతో లోక్‌సత్తాకు దేశవ్యాప్తంగా ఒక గొప్ప పేరు వచ్చింది. అవినీతిపై పోరాడే సంస్థగా తెలుగు ప్రజలు లోక్ సత్తాను ఆదరించడం ఆశ్రయించడం మొదలు పెట్టారు. ప్రజల్లో లోక్‌సత్తా పై పెరుగుతున్న నమ్మకాన్ని సంస్థాగత బలంగా మార్చడం కోసం, ఒక అనుభవజ్ఞుడైన నాయకుడు అవసరమయ్యారు. సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసి, అనేక ప్రజా ఉద్యమాలను, ప్రజా భాగస్వామ్య కార్య క్రమాలను నిర్వహించిన డీవీవీఎస్ వర్మ గారిని 2000 సంవ త్సరంలో జేపీ గారు లోక్‌సత్తా ఉద్యమంలోకి ఆహ్వానించి, ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. లోక్‌సత్తా ఉద్యమాన్ని వర్మగారికి ముందు వర్మగారికి తర్వాత అని రెండుగా విభజించి చూడవచ్చు.

వరంగల్ జిల్లాకు చెందిన రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ భండారి అంకయ్య గారిని ప్రచార కార్యదర్శిగా నియమించారు. లోక్‌సత్తా భావజాలాన్ని సామాన్యులకు కూడా అర్థం అయ్యేలా వివరించే పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జనశిక్షణ పేరుతో సుమారు 80వేల మంది పౌరులకు ప్రజాస్వామ్యం మీద అవగాహన కల్పించే కార్యక్రమాలు,



గ్రామ స్థాయిలో ప్రజాసంఘాల నిర్మాణం ఇలా లోక్‌సత్తా సంస్థాగతంగా విస్తరించింది. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని నగరాలు, పట్టణాలలో లోక్ సత్తా శాఖలు ఏర్పడ్డాయి. 400 మండలాలలో, 1500కి పైగా గ్రామాల్లో లోక్‌సత్తా సంఘాలు ఏర్పడ్డాయి. లోక్‌సత్తా సమావేశాలు ఆడిటోరియం/ హాల్స్‌లో మాత్రమే జరపాలి అనే నిబంధనను సవరించి, బహిరంగ సభలు, రోడ్ షో లతో లోక్‌సత్తా సంస్థ గ్రామగ్రామానికి విస్తరించింది.

**జాతీయ స్థాయికి జెపి గారు**

లోక్ సత్తా లక్ష్యాలు అన్నీ జాతీయ స్థాయికి ముడిపడినవి కావడంతో, జెపి గారు జాతీయ స్థాయిలో లోక్‌సత్తా భావజాల వ్యాప్తి, నిర్మాణంపై దృష్టి పెట్టారు. బెంగళూరు జనాగ్రహ లాంటి సంస్థలతో ఒక జాతీయ స్థాయి నెట్ వర్క్ ని ఏర్పాటు చేసారు. సోనియాగాంధి నాయకత్వంలో ఏర్పాటైన జాతీయ సలహా మండలిలో జేపీ సభ్యులుగా చేరారు. జేపీ గారి చొరవ, సూచనల మేరకే జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. సమాచార హక్కు చట్టం రూపకల్పనలో కూడా జేపీ గారు క్రియాశీల పాత్ర పోషించారు. ముఖ్యంగా సమాచారహక్కు కమీషనర్ల ఎంపిక విధానం సహా కొన్ని కీలక అంశాలలో అరుణా రాయ్ నాయకత్వంలోని ప్రజాసంఘాలకు కేంద్ర ప్రభుత్వానికి మధ్య వివాదం ఏర్పడి, అసలు సమాచార బిల్లు ఆమోదమే ఆగిపోయే పరిస్థితి వచ్చింది. అప్పుడు జేపీ గారు అటు ప్రజాసంఘాలను ఇటు ప్రభుత్వానికి మధ్యవర్తిగా వ్యవహరించి సమాచారహక్కు చట్టరూపం దాల్చడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు.

**దామాషా పద్ధతి ఎన్నికలు, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక:**

మన రాజకీయ, ప్రజాస్వామ్య ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసే , ధనరాజకీయాలను చాలా వరకు తగ్గించగలిగే బ్రహ్మాస్త్రం దామాషాపద్ధతి ఎన్నికలు, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక. ముఖ్యంగా దామాషా పద్దతిలో చట్టసభలకు ఎన్నికలు జరిగితే, మూడు నాలుగు శాతం ఓట్లు ఉన్న పార్టీలకు కూడా చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కుతుంది. అనైతిక పొత్తులు, అక్రమ ఖర్చులు లేకుండా కొంతైనా నిజాయితీ, ప్రజాసమస్యల మీద అవగాహన ఉన్నవారు చట్ట సభల సభ్యులుగా ఎన్నికయే అవకాశం ఉంటుంది. అలాగే ముఖ్యమంత్రులను కూడా నేరుగా ఎన్నుకుంటే, పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యేల బుజ్జగింపులు తగ్గి, సుస్థిరపాలన సాధ్యమవుతుంది. ఈ రెండు కీలక సంస్కరణల కోసం జేపీ గారు జాతీయ స్థాయిలో తీవ్ర ప్రయత్నాలు చేసారు. బీజేపీ సీనియర్ నేత లాల్ కృష్ణ అద్వాని గారితో ఈ దిశగా చర్చించి ఆయన సమ్మతి సాధించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ కూడా ఈ దిశగా సానుకూలంగా స్పందించారు. ఇక వామపక్ష పార్టీలు అయితే, ఎప్పటినుండో ఈ విధానం కావాలని డిమాండ్ చేస్తున్నాయి. అధికార పక్షం, ప్రతిపక్షం, ప్రభుత్వానికి బయటి నుండి మద్దతు ఇస్తున్న వామపక్షాలు మూడు పక్షాలు అంగీకరించడంతో ఈ పెద్ద సంస్కరణలు సాకారం కాబోతున్నాయి అని జేపీ గారు బలంగా నమ్మారు. కానీ ఢిల్లీలో ఉండే సంక్లిష్ట రాజకీయాలు జేపీ గారి ఆశలను అడియాశలు చేసాయి. అందరూ ఒప్పుకుంటారు కానీ అడుగుముందుకు పడదు. దాదాపు ఒక ఏడాది పాటు ఇదే అంశంపై జేపిగారు ఢిల్లీ స్థాయిలో తీవ్ర ప్రయత్నాలు చేసారు. ఎంతకీ అడుగుముందుకు పడకపోవడంతో,


చివరికి విసిగి వేసారిన జెపి గారు అనూహ్య నిర్ణయం తీసుకున్నారు.

**లోక్‌సత్తా పార్టీ స్థాపన:** లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న సంస్కరణలకు కనీసం 10శాతం ఓటర్ల మద్దతు ఉందని ప్రధాన రాజకీయ పార్టీలకు నిరూపిస్తే, అప్పుడయినా ఈ సంస్కరణలను అమలు చేస్తాయనే భావనతో లోక్‌సత్తా రాజకీయ పార్టీని జేపీ ప్రకటించారు. 2006 అక్టోబర్ రెండు న లోక్‌సత్తా పార్టీ ప్రకటన, లోక్‌సత్తా ఉద్యమంలో క్రియాశీలంగా ఉన్న దాదాపు అందరు బాధ్యులు లోక్‌సత్తా పార్టీవైపు వెళ్ళిపోయారు. సహజంగానే ఒక రాజకీయపార్టీకి ఉండే ఆకర్షణ కారణంగా, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ బలహీనపడుతూ 2009 నాటికి లోక్ సత్తా పార్టీ క్రియా శీలం అయింది. 2009 ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో లోక్‌సత్తా ఉనికికే ప్రమాదం ఏర్పడింది.

**లోక్‌సత్తా ఉద్యమం కొనసాగింపు:** ప్రజలు ఓట్లు వేయకపోయినా, ప్రజాస్వామ్యంపై నమ్మకం, దేశంపై ప్రేమ ఏమాత్రం తగ్గని జేపీ గారు, దేశంలో విద్య ఆరోగ్యరంగాల్లో మౌలిక సంస్కరణలు, స్థానిక ప్రభుత్వ సాధికారత కోసం లోక్ సత్తా ఉద్యమం ద్వారా, ప్రజాస్వామ్య సంస్కరణలపీఠం (ఎఫ్‌డీఆర్) ద్వారా నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు.

**లోక్‌సత్తా ప్రభావం:** కొన్ని ప్రభుత్వ శాఖల్లో సిటిజెన్ చార్టర్లను ప్రకటింపచేయడం, సమాచారహక్కు సాధించడం, లోక్‌పాల్ బిల్లు రూపకల్పనలో కీలకపాత్ర పోషించడం, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఆస్తులు అప్పులు నేర చరిత్ర ప్రకటించాలి అనే నిబంధన తీసుకురావడం, అన్నిటికి మించి విద్య, ఆరోగ్యం అనే కీలకఅంశాలను రాజకీయాలకు కేంద్ర బిందువుగా మార్చడంలో లోక్ సత్తా విజయం సాధించింది.




**లోక్ సత్తా ఎందుకు ఆశించినస్థాయిలో ఫలితాలు సాధించలేకపోయింది?**

ఇది చాలా అవసరమైన ప్రశ్న. జెపి గారి లాంటి ప్రజాదరణ ఉన్న నాయకుడు, బలమైన సంస్థాగత నిర్మాణం, ప్రజల జీవితాల్లో మంచి మార్పును తీసుకొచ్చే బలమైన ఎజెండా ఉన్నప్పటికీ లోక్‌సత్తా ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయింది అనే మాట నిజం. దీనికి కారణాలు ఏమిటి అని విశ్లేషిస్తే..

1.1997 అంటే దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన దశాబ్దం. 1991 లో పీవీ నరసింహారావు ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చింది. ఈ సంస్కరణలను వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. జేపీ గారు ఆర్థిక సంస్కరణలకు పూర్తి మద్దతుదారు. సాక్షాధారాలతో, తిరుగులేని లాజిక్ తో ఆర్థిక సంస్కరణలను సమర్థిస్తూ వ్యాసాలు రాయడం, ఉపన్యాసాలు ఇవ్వడం చేసేవారు. దీనివల్ల, కొన్ని అంశాలలో వామపక్ష పార్టీలు లోక్‌సత్తా కలసి పనిచేసినప్పటికీ, వామపక్ష మేధావులు చాలామంది ఇప్పటికీ లోక్ సత్తా ను తమ సైద్ధాంతిక శత్రువుగానే చూస్తారు. లోక్ సత్తా ఆవిర్భావం నాటికి వామపక్ష భావజాలం బలంగా ఉండేది. ముఖ్యంగా సమాజాన్ని ప్రభావితం చేసే మీడియా లాంటి రంగాల్లో వామపక్ష మద్దతుదారులు క్రియాశీల స్థానాల్లో ఉండేవారు. అందువల్ల, లోక్ సత్తా భావజాలాన్ని ప్రజలకి మరింత చేరువ చేయడం వీలుకాలేదు.

2.ప్రభుత్వ ఉద్యోగులలో వ్యతిరేకత: ప్రజలకు ప్రజాస్వామ్యం గురించి, పాలన గురించి అర్థం కావాలంటే, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల దగ్గర నుండి ఉద్యమం మొదలుపెట్టాలి అని లోక్ సత్తా భావించింది. ఆ కారణంగా బలమైన ప్రభుత్వఉద్యోగ వర్గాల్లో లోక్ సత్తాకి కనబడని శత్రువులు తయారయ్యారు.



3. రాజకీయనాయకులపై మోతాదు మించిన ప్రేమ: రాజకీయనాయకులు కూడా ఈ విషవలయంలో చిక్కుకున్న బాధితులే అని జెపి భావించారు. సాధారణ ప్రజలు, రాజకీయనాయకులను విలన్లుగా చూస్తారు. లోక్ సత్తా ఆటగాళ్ళు మారితే చాలదు ఆటనియమాలు మారాలి అని కీలక సంస్కరణలపై దృష్టిపెట్టింది. ఇది సాధారణ ప్రజలకు అర్థం కావడం, వారు ఆమోదించడం కష్టం. అందుకే యువత లోక్‌సత్తా పట్ల అనుకూలగా ఉండేవారు కాని, క్రియాశీల పాత్ర మాత్రం పోషించలేకపోయారు. పోనీ రాజకీయనాయకులు అయినా, లోక్ సత్తా మన సమస్యను అర్థం చేసుకుని మన గురించి కూడా ఆలోచిస్తోంది, లోక్ సత్తాని పరోక్షంగా అయినా సపోర్ట్ చేద్దాం అని అనుకోలేదు.

4. గొప్ప గొప్ప లక్ష్యాలు అన్నీ గొప్ప త్యాగాల ద్వారానే సాధ్యం అవుతాయి అని స్వామి వివేకానంద అన్నారు. పెన్షన్‌కి కూడా అర్హత రాకముందే తన ఉద్యోగాన్ని సమాజం కోసం త్యాగం చేసిన జెపి గారు, యువతను మాత్రం మీరు త్యాగాలు చేయొద్దు, మీ చదువు మీ వృత్తి మీరు చూసుకుంటూనే, మీ ఖాళీ సమయాన్ని మాత్రమే లోక్ సత్తా కు ఇవ్వండి అని చెప్పేవారు. ఇది కూడా లోక్ సత్తా బలాన్ని తగ్గించింది. 1999ప్రాంతంలో జేపీ గారు గనుక పిలుపు ఇచ్చి ఉంటే, కొన్ని వందలమంది అన్నీ వదులుకుని లోక్ సత్తా ఉద్యమం కోసం ముందుకు దూకేవారు. ఆ పని చేయకపోవడం కూడా లోక్‌సత్తా ఉద్యమ ఉధృతి పెరగకపోవడానికి ఒక కారణం.

5. ఆర్థిక సంస్కరణలవలన ప్రభుత్వంపై ఆధారపడే అవసరం తగ్గడం: ప్రైవేటీకరణ వలన, అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి రావడం వలన, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య రోజువారీ సంబంధం తగ్గిపోయింది. ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వాన్ని రెండు రోజులు విమర్శించడం తప్ప, పాలనను ప్రజలు పట్టించుకోవడం మానేశారు. దానికి తోడు ప్రభుత్వ ఆదాయం పెరగడంతో, ప్రజల ఆగ్రహాన్ని అసంతృప్తిని చల్లబరచేందుకు ఇబ్బడిముబ్బడిగా సంక్షేమపథకాలు అమలు చేస్తున్నాయి. దీనితో పాలనను సంస్కరించడం అనే సంక్లిష్టమైన ప్రక్రియపై అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు ఆసక్తి తగ్గిపోయింది.

తెలంగాణ ఉద్యమం: ప్రత్యేక తెలంగాణ కోసం 2009లో మొదలైన ఉద్యమం, 2014 దాకా రాష్ట్ర రాజకీయాలను శాసించడం, ఆ తర్వాత కూడా మతం, కులం పేరిట భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలు వలన, లోక్‌సత్తా సంస్కరణవాద ఎజెండాపై సమాజంలో చర్చను మరుగుపరచింది.

1997-2014 వరకు సమాజాన్ని ప్రభావితం చేసే స్థాయిలో ఉన్న వామపక్ష మేధావులు లోక్ సత్తా ని అంతర్గతంగా, బహిరంగంగా కూడా వ్యతిరేకించడం; సమాజాన్ని మార్చాలంటే ముందుండి నడిపించాల్సిన యువతని ఆకర్షించే పోరాటరూపాలు లోక్ సత్తా రూపొందించక లేకపోవడం, ప్రభుత్వ ఉద్యోగుల్లో వ్యతిరేకత, లోక్‌సత్తా చెబుతున్న సంస్కరణలు చేపడితే తమకే నష్టం అని రాజకీయ నాయకులు భావించడం, ఈ నాలుగు కారణాల వలన లోక్ సత్తా కేవలం కొద్దిమంది ఒక మధ్యతరగతి ప్రజలు, విద్యావంతుల వేదికగా మిగిలిపోయింది.

**లోక్ సత్తా మార్గమే శరణ్యం:**

ఇప్పుడే కాదు, ఇంకో ఇరవై ఏళ్ల తర్వాత అయినా, దేశంలో మౌలిక మార్పులు రావాలంటే, మనదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలి అంటే లోక్‌సత్తా సూచిస్తున్న దామాషా పద్ధతి ఎన్నికలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, విద్య ఆరోగ్యరంగాల ప్రక్షాళన తప్ప వేరే మార్గమే లేదు. అందుకే లోక్ సత్తా లక్ష్యాలు, భావజాలం ఇప్పటికీ ఎప్పటికీ అవసరమైనవే.

2014 తర్వాత కేంద్ర ప్రభుత్వ విధానం పూర్తిగా మారిపోయి, రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, సమాఖ్య వ్యవస్థని నీరుగారుస్తోంది. మరోపక్క కోట్లాదిరూపాయలు ఖర్చుపెట్టి గెలిచిన ఎమ్మెల్యే లను కాపాడుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేస్తున్నాయి. సంక్షేమం పేరుతో సాగుతున్న ఉచితాలకు కూడా డబ్బులేని పరిస్థితికి రాష్ట్రాలు చేరుతున్నాయి. అర్హతకు తగ్గ ఉద్యోగాలు రావడం లేదు అన్న అసంతృప్తి కూడా యువతలో పెరుగుతోంది. భావోద్వేగరాజకీయాలు, ధన రాజకీయాల పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. వీటన్నిటికి లోక్‌సత్తా సూచిస్తున్న సంస్కరణలే ఏకైక పరిష్కారం.

ఫ్రెంచ్ రచయిత విక్టర్ హ్యూగో చెప్పినట్లు.. "సమయం ఆసన్నమైన ఆలోచన కన్నా శక్తివంతమైంది ఏదీ లేదు". లోక్ సత్తా ఆలోచనలకు సమయం ఆసన్నమైనప్పుడు ప్రపంచంలో ఏ శక్తి కూడా దాన్ని అడ్డుకోలేదు. అప్పటివరకు ఓపికగా ఒక్కో అడుగూ వేసుకుంటూ, ఈ భావజాలాన్ని వ్యాప్తిచేయడమే లోక్ సత్తా అభిమానుల కర్తవ్యం.

**– శిరమని నరేష్**

# పొంచివున్న నైపుణ్యాల సంక్షోభం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ-

ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఆందోళనలు ఉవ్వెత్తున ఎగసి విస్తరించటం దేశాన్ని నివ్వెరపరిచింది. 'నీట్' పరీక్షాపత్రం లీక్ పట్ల ఆగ్రహంగా మొదలైన యువత నిరసన.. చివరకు పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక నిరాశా నిస్పృహల...

ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఆందోళనలు ఉవ్వెత్తున ఎగసి విస్తరించటం దేశాన్ని నివ్వెరపరిచింది. 'నీట్' పరీక్షాపత్రం లీక్ పట్ల ఆగ్రహంగా మొదలైన యువత నిరసన.. చివరకు పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక నిరాశా నిస్పృహల పట్ల ప్రతిఘటనోద్యమంగా పరిణమించింది. డిగ్రీలున్నా ఉద్యోగాలు రాకపోవటం, ఆకాంక్షలు పెరుగుతున్నా తగినంతగా అవకాశాలు లేకపోవటం యువతను తిరగబడేలా చేసింది. ప్రవేశ పరీక్షాపత్రం లీకవటం యువతను సమీకరించే ఒక నిప్పురవ్వ మాత్రమే. దాని వెనక దాగివున్న సంక్షోభం నిజమైనది, సంక్లిష్టమైనది.

పాఠశాలల్లో కావచ్చు, కాలేజీల్లో కావచ్చు.. మన విద్యావ్యవస్థ చాలామేర కుప్పకూలింది. పిల్లల్లో 80శాతం మంది స్కూలు విద్యలో పాసవుతున్నారు కానీ, వారికి చదువులో ఎటువంటి నిజమైన పునాదీ ఉండటం లేదు. ఇందులో వారి తప్పు కూడా ఏమీ లేదు. బట్టీపట్టటం ద్వారా నేర్చుకోవటం, మూకుమ్మడి కాపీయింగ్‌లతో పాసవటం అనే అవ్యవస్థ వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది.

రెండోది, విద్యార్థులు ఏం నేర్చుకున్నారో బేరీజు వేసే పరీక్షా పద్ధతులు అర్థరహితంగా ఉండటంతో.. అత్యధిక శాతం ఆరాటపడే 'స్టెమ్' (సైన్స్..టెక్నాలజీ..ఇంజినీరింగ్..మ్యాథ్స్) కోర్సుల్లో చేరేందుకు ప్రత్యేకంగా పోటీ ప్రవేశ పరీక్షలు అవసరమయ్యాయి. మూడోది, చాలా సందర్భాల్లో రాష్ట్రాలు నిర్వహించే పరీక్షా పద్ధతుల్లో విశ్వసనీయత లోపిస్తోంది. బోర్డు ప్రమాణాల్లో రాష్ట్రాల మధ్య భారీ అంతరం ఉంటోంది. దీంతో, ప్రామాణిక, నిష్పాక్షిక, న్యాయ మైన బేరీజు కోసం దేశవ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష అవసర మవుతోంది. నాలుగోది, వైద్య కళాశాలలు పుట్టగొడుగుల్లా పెరిగినప్పటికీ, ఎంపిక చేసిన కొన్ని కళాశాలలు మాత్రమే యువ మెడికోలకు కనీస ప్రమాణాల శిక్షణను అందించ గలుగుతున్నాయి. కాబట్టి, లక్షలాది మందికి వైద్య కళాశాలల్లో సీట్లు అందుబాటులో ఉన్నా, మెరుగైన కొన్ని కళాశాలలకే డిమాండ్ ఉంది. వాటిల్లో చేరేందుకు ఉత్తమ ర్యాంకుల కోసం విపరీత పోటీ ఉంటోంది.

అయిదోది, మెడికల్ పోటీ ప్రవేశ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసే డిమాండ్‌కు అనుగుణంగా అనేక కోచింగ్



సెంటర్లు వెలిశాయి. పదవ తరగతి తర్వాత శిక్షణ-- చదువును విభాగాలవారీ ప్యాకేజీలతో అందించ నారంభించాయి. పోటీ, పాఠశాల పునాదులు బలహీనంగా ఉండటం వల్ల.. ఆ రెండేళ్లపాటు యువ విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

ఇంత మితిమీరిన ఒత్తిడి వాతావరణంలో, పరీక్షా పత్రం లీక్ అయిందంటే-- అది యువతకు, వారి తల్లిదండ్రులకు శరాఘాతమే. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్ అంతటి అలజడికి దారితీయటంలో ఆశ్చర్యమేమీ లేదు. విద్యార్థులు, తల్లిదండ్రుల బాధను గ్రహించి కేంద్ర ప్రభుత్వం సహానుభూతితో సకాలంలో బలంగా స్పందించి ఉండాల్సింది. రాజకీయంగా సున్నితంగా వారితో కూర్చుని మాట్లాడాల్సింది. అలాగాక, సవాలక్ష సమస్యల్లో ఇదొకటి అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించింది. భారీఎత్తున యువత స్వచ్ఛందంగా తరలివచ్చే ఓ ఉద్యమానికి నిప్పురవ్వ రాజుకుంటోందని అంచనా వేయలేకపోయింది.

అధికారాన్వేషణలో మునిగితేలే మనలాంటి సమాజంలో ఇలాంటి తక్షణ రాజకీయ పర్యవసానాలు రసవత్తరంగా అనిపిస్తాయిగానీ, మనం ఆ నిప్పురవ్వను దాటి ఆలోచించాలి. ఏమాత్రం ఆజ్యం తగిలినా ఓ పెద్ద విస్ఫోటనానికి దారితీసే మూలాల్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. మన 'విద్య-- నైపుణ్యాలు-- ఉపాధి అవకాశాల' అభివృద్ధి వలయాన్ని దెబ్బతీసే ఒక లోతైన సంక్షోభం అందులో దాగివుంది.

ప్రస్తుతం మన దేశంలో ప్రతిష్ఠాత్మక కోర్సుల్లో చేరుతున్న వారికి కూడా నైపుణ్యాలు ఉండటం లేదు. ఉద్యోగాల్లోకి తీసుకోవటానికి చాలామందికి తగిన నైపుణ్యాలు లేవు. 13.5 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో కేవలం 15--20శాతం మందికే ఉద్యోగాలకు తగిన కనీస నైపుణ్యాలున్నాయని అంచనా.

ఏళ్ల తరబడి కాలేజీల్లో చదువుకున్నాక, ఒక విలువ లేని డిగ్రీతో యువత బయటకు వస్తున్నారు. వైద్య గ్రాడ్యుయేట్లకు కూడా శిక్షణ అరకొరగా ఉంటోంది. పట్టభద్రుల సంఖ్యతో పొంతన లేకుండా వైద్య పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు అతి తక్కువ సంఖ్యలో ఉండటంతో, అందులో చేరగలగటం భగీరథ ప్రయత్నంలా మారుతోంది. ఎలాగోలా మరో ప్రవేశ పరీక్షలో నెగ్గి, పోస్టుగ్రాడ్యుయేట్ శిక్షణ తీసుకున్న తర్వాత కూడా, వైద్య వృత్తి ప్రాక్టీస్‌కి తగిన నైపుణ్యాలు, నమ్మకం కోసం పేరొందిన వైద్య నిపుణుల వద్ద కొన్నేళ్లపాటు సహాయకులుగా పనిచేయాల్సి వస్తుంది. ఎంతో విలువైనవిగా భావించే 'స్టెమ్' కోర్సుల పరిస్థితే ఇంత ఇబ్బందికరంగా ఉంటే, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఏటా చేరే సుమారు 90లక్షల మంది విద్యార్థుల పరిస్థితేమిటో ఊహించుకోవచ్చు.

ఉద్యోగ మార్కెట్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారిపోతోంది. యూనివర్సిటీ డిగ్రీలు అంతేవేగంగా ప్రాధాన్యాన్ని కోల్పోతున్నాయి. ఈ చదువులోనూ అత్తెసరు ప్రమాణాలుంటే.. ఇక ఆ దుస్థితికి అంతుండదు. కాబట్టి, నైపుణ్యాల అంతరం అనేది మనం తక్షణం దృష్టి సారించాల్సిన అంశం.

ఏ ఆధునిక ఆర్థిక వ్యవస్థకయినా అత్యున్నత నైపుణ్యాలున్న టెక్నోక్రాట్లు పరిమిత సంఖ్యలోను, నైపుణ్యాలున్న శ్రామిక ఉద్యోగులు పెద్దసంఖ్యలోను అవసరం. కానీ భారత్‌లో ఆ పిరమిడ్ తలకిందులుగా ఉంది. భారత్‌లో కేవలం 50శాతం ఐ.టి.ఐ సీట్లు భర్తీ అవుతున్నాయి. కొద్దిమంది యువత మాత్రమే ఐ.టి.ఐల్లో చేరుతున్నారు (సుమారు 13.20 లక్షలు). పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ఇంకా తక్కువమంది (సుమారు 6.4 లక్షలు) విద్యార్థులు నమోదు చేసుకుంటున్నారు. ఇంజినీరింగ్‌లో చేరేవారితో (13.54 లక్షలు) పోలిస్తే, వారి సంఖ్య అలా తక్కువగా ఉండటం ఏ అభివృద్ధి చెందిన దేశంలోనూ కనిపించని సరళి. ఈ కోర్సులన్నిటిలోనూ ఎక్కువమంది విద్యార్థులు నిజమైన నైపుణ్యాలు, ఉత్పాదకత లేకుండా కేవలం సర్టిఫికెట్లు, డిగ్రీలు అందుకుంటారు.

చైనా ప్రతి సంవత్సరం 16.62 లక్షల మంది ఇంజినీర్లకు అద్భుతమైన శిక్షణనిస్తుంది. వారంతా నిజమైన టెక్నోక్రాట్లు, నైపుణ్యాలున్న ఇంజినీర్లు. అదేవిధంగా, ఆ దేశం వృత్తి విద్యలో 56.40 లక్షల యువతకు నిజమైన నైపుణ్యాల్ని




అందిస్తుంది. చైనాలో పాఠశాల విద్య పునాదులు కూడా చాలా ప్రామాణికంగా ఉన్నాయి.

మనం స్కూళ్లు, కళాశాలలను దాదాపు అందరికీ అందుబాటులోకి విస్తరించాం. కానీ కొన్ని ఖరీదైన విద్యాసంస్థల్లో తప్ప, చాలా సందర్భాల్లో చదువుల నాణ్యత అధ్వానంగా ఉంటోంది. ఈ మొత్తంలో బాధితులు-- మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులు, తల్లిదండ్రులు. సంపదసృష్టిలో 'జెన్ జీ'కి నిజమైన అవకాశం లభించాలంటే, మన విద్యను, నైపుణ్యాల అభివృద్ధిని సమూలంగా మార్చుకోవాలి.

ఆపైన సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలను సృష్టించటానికి మనం చేయాల్సింది చాలా ఉంది. అది వేరే చర్చ. నిశితంగా పరిశీలించే ప్రతి ఒక్కరికీ విద్యారంగంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం గురించి తెలుసు. యువ జనాభా పరంగా మనకున్న అద్భుతావకాశాల్ని మనం వృథా చేసుకుంటున్నాం. ఆ అవకాశం ఎల్లకాలం కొనసాగదు. త్వరలో ముగుస్తుంది. త్వరపడి, దృఢ సంకల్పంతో వ్యవహరిస్తేనే అవకాశాన్ని మనం సద్వినియోగం గావించు కోగలం.

రాజకీయంగా ఒక స్థూల ఏకాభిప్రాయానికి రావాల్సిన అంశమిది. ఎందుకంటే, ప్రతి పార్టీకీ ఇందులో గరిష్ఠ వ్యూహాత్మక రాజకీయ ప్రయోజనం దాగివుంది. విద్యను నియంత్రించేది రాష్ట్రాలు కాబట్టి, ఎక్కువ కార్యాచరణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉంటుంది.

రాజకీయాలు, పరిపాలన, పౌర సమాజం, మీడియా, విద్యారంగంలోని మనమంతా సంఘటితమై నిర్మాణాత్మక, సృజనాత్మక పరిష్కారంతో ఈ సంక్షోభంపై స్పందించాల్సి ఉంది. ఆయాసం తప్ప ఫలితంలేని పడికట్టు పదాలకు, చేసిన తప్పులే మళ్లీ మళ్లీ చేసే యథాతథ పాలనా ధోరణికి ఇక కాలం చెల్లింది. మనం ఈ సవాలుకు దీటుగా, యుద్ధ ప్రాతిపదికన స్పందించకపోతే.. ఈ సంక్షోభం మన రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్ని, సమాజాన్ని కమ్మేస్తుంది. మన భవిష్యత్తును కుంగదీస్తుంది.

# సీజేఐ కామెంట్ నుండి విద్యామంత్రి రాజీనామా దాకా..

మన న్యాయస్థానాల్లో ఎంత నిజాయతీ ఉందో, లోపాల్ని సరిదిద్దుకోకుండా వ్యక్తిగత నిజాయతీ మీదే ఎక్కువ ఆధారపడే పెత్తందారీ సంస్కృతీ అంతే ఉంది. వ్యవస్థ కోసం న్యాయసంస్కరణల్ని ప్రతిపాదిస్తే.. తమను తక్కువ చేసినట్లుగా భావిస్తుంటారు. అందువల్లేనేమో, బహుశా మన జడ్జీలు ఇచ్చే తీర్పులకన్నా.. వారి పాసింగ్ కామెంట్లు ఎక్కువ మీడియాలో పతాక శీర్షికల్లో వస్తున్నాయి. ఆ రకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలోని ఒక పదం గొలుసుకట్టులా పలు పరిణామాలకు దారితీసి.. నీట్ పరీక్షాపత్రం లీకేజీ నేపథ్యంలో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆందోళనలు, సోనం వాంగ్‌చుక్ అనే విద్యావేత్త, ఇంజినీర్, సామాజిక కార్యకర్త నిరాహారదీక్ష, చివరికి యూనియన్ విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దాకా వచ్చింది. ఇందులో వ్యక్తిగత అంశాలకన్నా.. దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన వ్యవస్థీకృత అంశాలే ఎక్కువ. వాంగ్‌చుక్ సతీమణి ఒక ఆంగ్ల పత్రికకు రాసిన వ్యాసంలో పేర్కొన్నట్లు.. అపారమైన కష్టాన్ని ప్రదర్శిస్తే తప్ప పౌరుల ఫిర్యాదులకు, డిమాండ్లకు ఎన్నికలులేని సమయంలో ప్రభుత్వాలు స్పందించకపోవటం అందులో ఒకటి.

రాజకీయం, ఎన్నికలు, అధికారం ఒకటే అన్న భావం మన మెదళ్లలో ఒక సంస్కృతిగా వేళ్లూనుకోవటం వల్ల కావొచ్చు.. ప్రజల కోసం, ప్రజల ద్వారా, ప్రజల యొక్క అనే ప్రజాస్వామిక తత్వం ఇంకా మనలో ఇంకలేదు. దీంతో, జాతీయోద్యమంలో గాంధీ ఇదేతరహా నిరాహారదీక్షలతో బ్రిటిష్ వారిని గడగడలాడించారనే అభిప్రాయం స్వతంత్రం వచ్చి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పాలన మొదలయ్యాక కూడా మనల్ని వీడలేదు. లోక్‌సత్తా స్ఫూర్తితో ఏర్పడిన 'ఇండియా ఎగనెస్ట్ కరప్షన్' ఉద్యమం ఆధ్వర్యంలో 2011లో అన్నా హజారే బృందం అలాంటి నిరాహారదీక్ష చేసి ఏదోకరూపంలో లోక్‌పాల్ చట్టాన్ని తేవటం, ఆ ఉద్యమంలోని పలువురు నేతలు దేశవ్యాప్తంగా ప్రచారంలోకి రావటం, అరవింద్ కేజ్రీవాల్ 'ఆప్' పార్టీ స్థాపించి ఢిల్లీ ముఖ్యమంత్రి కాగలగటం.. అది ఆకర్షణీయ పోరాట మార్గమనే భావాన్ని స్వేచ్ఛా ఆర్థిక వ్యవస్థలో కాస్త సంపాదనాపరులైన యువతలోనూ వ్యాపింపచేసింది. వాంగ్‌చుక్‌కి ప్రత్యక్షంగా తెలుసు. కానీ విద్యావ్యవస్థలో ఏ పరీక్షల పద్ధతైతే అధ్వాన్నంగా ఉందో దాని చుట్టూ రాజకీయ చర్చను తీసుకొచ్చే ప్రయత్నం చేయకపోవటం వల్ల.. ఉన్న లోపాల్ని కొనసాగించటం తప్ప, ఆయన దీక్ష ద్వారా కనీసం



చర్చను కూడా లేవనెత్తలేకపోయారు. పైగా ఈ రకమైన చర్చ కోణంలో.. విద్య, ఆరోగ్యం ఎక్కువగా రాష్ట్రాలకు సంబంధించిన అంశాలు. యూనియన్ ప్రభుత్వం పాత్ర అందులో తక్కువ. కాబట్టి.. రెండు అంశాలు: ఎ) సరైన డిమాండ్లు తీసుకోవటం బి) నిరాహారదీక్షను కేవలం నిరసనకు పరిమితం చేయటం. ఈ రకంగా చూస్తే, 2012లో హైదరాబాద్‌లో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చేసిన 'సురాజ్య దీక్ష' రాజ్యాంగబద్ధ నమూనా. జేపీ మూడు రోజుల పాటు నిరాహారదీక్ష చేశారు. 'అవినీతి అంతం, పౌరులకు హక్కుగా ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు, పుట్టుకతో వివక్ష లేకుండా అందరూ ఎదిగేందుకు వీలుగా.. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, ఓట్లు కొనుగోలు చేయకుండా దామాషా పద్ధతి తదితర ఎన్నికల సంస్కరణలు' అనే అయిదు అంశాల ఎజెండాపై ప్రజలను చైతన్యపరచటం, పార్టీలన్నిటి మధ్యా ఏకాభిప్రాయం సాధించటం లక్ష్యంగా ఆ దీక్ష చేశారు తప్ప, ఎవరినీ బెదిరించటానికి కాదు. అన్ని పార్టీలవారూ వచ్చి అందుకు మద్దతు తెలిపారు. అనుకున్నంత మార్పు రాకున్నా, ఆ అంశాలు చర్చనీయమయ్యాయి, కొంతమేర ఆచరణలో విధానపరమైన దిద్దుబాటు జరుగుతోంది. మంత్రి రాజీనామా మినహా విద్యార్థుల కోణంలో అన్నిరకాలుగా సానుకూలంగా యూనియన్ మంత్రులు హామీ ఇవ్వటంతో.. చివరికి 26 రోజుల నిరాహారం అనంతరం వాంగ్‌చుక్ దీక్షను విరమించారు. అయితే, సీజేపీ నాయకులు ఈ విరమణ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఆందోళనను కొనసాగించటం, దేశవ్యాప్తంగా యువత మద్దతు పెరగటంతో చివరికి ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతోపాటు.. విద్యార్థులపై కేసులు




ఎత్తివేయటం, ఆత్మహత్యకు పాల్పడినవారికి పరిహారం వంటి అంశాలపై కూడా మోదీ ప్రభుత్వం హామీ ఇవ్వటంతో విజయోత్సాహంతో సీజేపీ 37 రోజుల దీక్ష విరమించింది.

నీట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించటం వల్ల సమస్య పరిష్కార మవుతుందనే వాదనలున్నాయిగానీ, అంత సాంకేతిక విస్తృతి లేకపోవటం వల్ల రోజుల తరబడి పరీక్షలు నిర్వహించాల్సి రావటం కొత్త సమస్యల్ని సృష్టించవచ్చు అనే అనుమానా లున్నాయి. పాఠశాల స్థాయి నుండి బేరీజు వేయకుండా, ఒకేసారి పరీక్షను తగిన సిబ్బంది లేకుండా నిర్వహించటం వల్ల సమస్య ఇంకా జటిలమవుతోందని నిపుణులు అంటున్నారు. ఆ ఒత్తిడిని సీబీఎస్ఈ తట్టుకోలేకపోవటం వల్లే, ఎన్‌టీయే వ్యవస్థను రూపొందించారని.. ఇప్పుడు ఎన్‌టీయే రద్దు, శిక్షల్ని, జరిమాల్ని పెంచటం వంటి వాటి వల్ల విద్యార్థులకు ఒరిగేదేమీ లేదంటున్నారు. ఇవేవీ ఆలోచించకుండా, మంత్రి రాజీనామా చేయటం మీదే పట్టుబడితే.. ఆటగాడు మారతాడు తప్ప, ఆట నియమాలు మారవు. ఏ పరీక్షలకు సంబంధించో తెలియదుగానీ, పరీక్షల విధానంలో సంస్కరణలపై మరో హైపవర్ టెక్నోక్రాట్ కమిటీని నందన్ నీలేకని నేతృత్వంలో మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నాలుగు వారాల తర్వాత పరీక్షల పద్ధతికి సంబంధించి ప్రభుత్వంతో చర్చిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తెలిపారు. ఈలోగా అయినా, వ్యవస్థలో మార్పుకి ఎలాంటి నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలో నిపుణుల సలహాలు స్వీకరించే విజ్ఞతను ప్రదర్శిస్తారని ఆశిద్దాం.

ఇక రెండో అంశం, వాంగ్‌చుక్ సతీమణి ప్రస్తావించినది. ఎంతో శ్రమకోరిస్తే, త్యాగాలు చేస్తే తప్ప ప్రజల డిమాండ్లను ప్రభుత్వాలు పట్టించుకోవా? ఇది మన ప్రస్తుత ప్రజాస్వామ్య దశలో కచ్చితంగా అడగాల్సిన ప్రశ్న. కేంద్రీకృత పాలన, పార్టీ వ్యవస్థలో తమకు ఓట్లపరంగా ఇప్పట్లో అవసరం లేదనుకుంటే.. తమ పుర్రెలో పుట్టిన బుద్ధికి అనుగుణంగా మాత్రమే పైస్థాయిలోనివారు సమస్యల పట్ల స్పందించటం ఇందుకు కారణం. సమాచార ప్రవాహంలో ప్రజల జ్ఞాపకశక్తి తక్కువగా ఉండటం, తాత్కాలిక తాయిలాలతో మెప్పించగలమనే ధీమా ఉండటం కూడా పాలకుల పెత్తందారీ ధోరణికి కారణాలు.

వాంగ్‌చుక్ ఆందోళన చేస్తున్న కారణం కంటే బలమైన అంశంపై ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ఏడాది పాటు ఆందోళన చేశారు. కానీ వారి వాదన తప్పయినా, వారిని పట్టించుకుని నచ్చచెప్పే ప్రయత్నం సక్రమంగా జరగకపోవటం వల్ల చివరికి ఆ రైతులకే గణనీయ మేలు చేసే మూడు వ్యవసాయ చట్ట సవరణల్ని మోదీ ప్రభుత్వం రద్దుచేసింది. అదేవిధంగా, డీలిమిటేషన్. దీనిపై కూడా అందరినీ ఒప్పించే ప్రజాస్వామిక సంస్కృతి తగినంత లేకపోవటం వల్ల.. తమ రాష్ట్రాలకు మేలు చేసే చట్టాల్ని కూడా ప్రతిపక్షాలు తిరస్కరించాయి. ఎన్నికల మధ్యకాలంలో ప్రజల సమస్యలకు స్పందించటానికి కూడా రాబోయే ఎన్నికల్లో ఓట్లే కీలకమవుతున్నాయి. ఈ కారణంగానే, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా చట్టసభలో తప్ప ప్రభుత్వంలో భాగంకాని ఎమ్మెల్యేలు, ఎంపీలకు సైతం ఏటా ఏదోకరూపంలో నిధుల్ని మంజూరు చేస్తున్నారు. వీటితోపాటు ఎన్నికల్లో గెలవటానికి అయిదేళ్ల ముందు నుంచి కార్యకర్తలను పోషించేందుకు, ఎన్నికల సమయంలో ఓట్ల కొనుగోలుకి వినియోగించిన డబ్బును రాబట్టుకోవటానికి అన్ని రకాల అనుమతుల్నీ ముఖ్యమంత్రి మౌనంగా మంజూరు చేస్తారు. 2023లో తెలంగాణలో కేసీఆర్ ఓటమికి, 2026లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ ఓటమికి ఎమ్మెల్యేలు ఈ రకంగా మితిమీరి అవినీతికి పాల్పడటం కూడా ఒక ప్రధాన కారణం. ఇలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా.. ఎమ్మెల్యేలకు, ప్రజలకు ఉభయతారకంగా ఆంధ్రప్రదేశ్ లాంటి చోట మరో లోపాయికారీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 'స్వర్ణ పథకం' పేరుతో ఏపీలో ప్రారంభించిన ఆ వ్యవస్థ.. ఎన్నికైన శాసనసభ్యులను ప్రజాప్రయోజక విధానాల అమలులో కీలక పాత్రధారులుగా మారుస్తుంది. తమ నియోజకవర్గంలో ముఖ్యమైన అభివృద్ధి పనులు పర్యవేక్షించటానికి తగిన సంస్థాగత వనరులను ఎమ్మెల్యేలకు అందిస్తుంది. ఈ రకంగా 175 అసెంబ్లీ నియోజక వర్గాలలోని 688 మండలాల్లో 'స్వర్ణ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు' (ఎస్‌సీవీఏపీయూ) ఏపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ యూనిట్లు ఎమ్మెల్యే పర్యవేక్షణలో పనిచేస్తాయి. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఒక యువ వృత్తి నిపుణుడు, నాలెడ్జ్ పార్టనర్, రంగాలవారీ విజన్ సిబ్బంది ఒక్కో యూనిట్‌లో ఉంటారు. వాస్తవానికి ఈ



పనులన్నీ చేయటానికే ప్రభుత్వ యంత్రాంగం ఉంది. కానీ అధికార వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు, జవాబుదారీతనంతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తి లేకపోవటంతో.. నియోజకవర్గంలోని గ్రామాలు, మండలాలు, చిన్న పట్టణాలు, నగరాలన్నిటికీ ఎమ్మెల్యేయే మకుటంలేని మహారాజు. ఏం జరిగినా ఆయన కనుసన్నల్లోనే జరగాలి. అసెంబ్లీలో (ఎంపీలు లోక్‌సభలో) చట్టాల గురించి ఆలోచించకుండా నియోజకవర్గంలో సెటిల్‌మెంట్లు, బదిలీలు వంటివి చేస్తుంటారు. ఇక సర్పంచ్‌లు, కార్పొరేటర్లూ.. ఎమ్మెల్యే, ఎంపీలను కాకాపట్టి ఎన్నికల్లో అక్రమఖర్చును రాబట్టుకోవటానికి ప్రయత్నిస్తుంటారు. ఈ మొత్తంలో ప్రభుత్వ యంత్రాంగం వారికి సహకరించాలి కాబట్టి.. వాళ్లలో ఎక్కువమంది ఆ మేరకు ప్రజాసేవలకు గండికొడతారు. అందువల్లే, సోషల్ మీడియా సాంకేతికత లేదా వేరే రూపంలో ఏ ముఖ్యమంత్రో, ప్రధానమంత్రో, వారి కుటుంబసభ్యులు లేదా వారి పక్షం వహించే వ్యాపారస్తులకు సమస్య చేరి.. వారి స్పందించాలనుకునేసరికి అంత సమయం పడుతుంది. ఇలా అధికారాల విభజన, దానివల్ల జవాబుదారీతనం అస్తవ్యస్తం కావటం వల్ల.. ప్రజల్లో అసంతృప్తి నిరంతరం పెరుగుతోంది. ఇది వ్యక్తుల కన్నా, వ్యవస్థీకృత వైఫల్యం. కాబట్టి.. అధికారాన్ని ప్రజల ఎంత దగ్గర చేయగలిగితే, ఎంత స్థానికం చేయగలిగితే.. అంత వేగంగా సమస్యలను పరిష్కరించవచ్చు. కోట్లాది మంది ప్రజల సమస్యలకు స్థానిక ప్రభుత్వాల సాధికారతే 80% మేర సమస్యలకు పరిష్కారం. దాంతోపాటు, ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలపై ఆధారపడకుండా నేరుగా ఎన్నికయ్యే ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిని రాష్ట్రాల్లో తీసుకురావాలి. దామాషా

కాక్రోచ్ పార్టీ అగ్రనేతలు చెబుతున్నట్లు వ్యవస్థను మార్చటమే లక్ష్యమైతే.. ఆ పరిణామాల్ని దాటి దీర్ఘకాలిక ప్రణాళికతో పనిచేయాలి. ఇందులో మొదటగా, కాక్రోచ్ పార్టీకి సరైన ఎజెండా ముఖ్యం. ప్రచారాన్ని ఉపయోగించుకుని, కనీసం ఆ మేరకయినా ప్రజల్ని మెప్పించటం ద్వారా ప్రధాన పార్టీల్ని ప్రభావితం చేయవచ్చు. ఎజెండాకి తోడు నాయకత్వ సామర్థ్యం కూడా ఉంటే, రాజకీయ పార్టీగా మారి.. ఎన్నికల్లో పోటీ ద్వారా ఇంకా ఎక్కువ ప్రభావం చూపవచ్చు.

పద్ధతిని తీసుకురావాలి.

ఇక ఈ చర్చలో ఇంకో కోణం ఉంది. కాక్రోచ్ పార్టీ అగ్రనేతలు చెబుతున్నట్లు వ్యవస్థను మార్చటమే లక్ష్యమైతే.. ఆ పరిణామాల్ని దాటి దీర్ఘకాలిక ప్రణాళికతో పనిచేయాలి. ఇందులో మొదటగా, కాక్రోచ్ పార్టీకి సరైన ఎజెండా ముఖ్యం. ప్రచారాన్ని ఉపయోగించుకుని, కనీసం ఆ మేరకయినా ప్రజల్ని మెప్పించటం ద్వారా ప్రధాన పార్టీల్ని ప్రభావితం చేయవచ్చు. ఎజెండాకి తోడు నాయకత్వ సామర్థ్యం కూడా ఉంటే, రాజకీయ పార్టీగా మారి.. ఎన్నికల్లో పోటీ ద్వారా ఇంకా ఎక్కువ ప్రభావం చూపవచ్చు. కానీ ఓటు వృథా అవుతుందనుకునే మన ఎన్నికల వ్యవస్థలో మూడో పార్టీకి ఓటు వేయటం చాలా అరుదు. ఇప్పటికైతే ఆ పార్టీ చేతుల్లో ఉన్న అంశం – సరైన ఎజెండాని రూపొందించుకుని ఆ అంశాల మీద పనిచేయటం. ఈ రకంగా నాయకులుగా దేశవ్యాప్తంగా ఎదగటానికి కొంత దీర్ఘకాలం పట్టవచ్చు. ఇప్పటికే స్థానిక ప్రభుత్వాలు ఈ దేశంలో వేళ్లూనుకుని ఉంటే ఈ సమస్యలు తలెత్తేవి కావు. కోట్ల మంది యువత అనుసరిస్తున్న రాజకీయ ఉద్యమాన్ని విస్మరించే సాహసం ప్రధాన పార్టీలు చేసేవి కావు. ఈ నేపథ్యంలో, భారత్‌కున్న ఆర్థికాభివృద్ధి అవకాశం పూర్తి సామర్థ్యంతో సద్వినియోగమయ్యేలా చేసేందుకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, చిన్న పట్టణాల అభివృద్ధి, ఎన్నికల సంస్కరణలు వంటి ఎజెండా మీద స్థానికంగా పనిచేస్తూ రాజకీయాన్ని ప్రభావితం చేయటం కాక్రోచ్‌లకు సరైన పంథా. ఈ రకంగా కొంతమంది నాయకులు రూపుదిద్దుకుని, పరిస్థితులు అనుకూలిస్తే, లోక్‌సత్తాలాగా ఎన్నికల్లో పోటీ చేసి సీజేపీ గెలవొచ్చు. సీజేఐ వ్యాఖ్య నుండి వాంగ్‌చుక్ నిరాహారదీక్ష వరకూ ఉన్న కొన్ని వ్యవస్థీకృత అంశాలివి. ✢

# ఎంఎస్‌పీ నుండి రైతుల సంకెళ్లు తెంచండి.. వ్యవసాయాన్ని వ్యాపారంలా మార్చండి: జేపీ






కౌలుదారులైనా, యజమానులైనా రైతుల ఆదాయాన్ని పెంచకుండా వ్యవసాయాన్ని బాగుచేయటం సాధ్యం కాదని, ఇంకా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వంటి కరవుకాలం పద్ధతుల్ని అమలుచేయకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల ద్వారా ఎక్కువ ధర లభించేలా చేయాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 1991లో దేశంలో వచ్చిన ఆర్థిక సరళీకరణ విధానాలు వ్యవసాయరంగాన్ని స్పృశించకపోవటం దురదృష్టకర మన్నారు. 21వ శతాబ్దంలోనూ అసమర్థ రాజకీయ లబ్ధి కోసం రైతులకు సంకెళ్లను కొనసాగిస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ వ్యవసాయం, ఇంధన వ్యవసాయం వంటి పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని వ్యాపారంలా నిర్వహించే పద్ధతుల్ని ప్రవేశపెట్టాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల పట్ల శ్రద్ధ చూపుతున్నా, అటు సమాజానికి, ఇటు రైతులకు ఉపయోగంలేని రుణమాఫీ వంటి పద్ధతుల వల్ల నష్టం కొనసాగుతోందన్నారు. ప్రస్తుత జాతీయ స్థాయి ప్రభుత్వం మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నందున, డిమాండ్ ఉన్న పంటల సాగు, ఉత్పాదకత పెంపు, విలువ ఆధారితంగా మార్చటం, తక్కువ రవాణా ఖర్చుతో ఎగుమతులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సుమారు 100 బిలియన్ డాలర్లకుపైగా ఎగుమతి సామర్థ్యం మన వ్యవసాయానికి ఉందన్నారు. మార్కెటింగ్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు) కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఏపీ మాస్ (ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి సొసైటీ) రజతోత్సవాల జాతీయ సదస్సు సందర్భంగా హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐలో జరిగిన చర్చా కార్యక్రమంలో జేపీ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, జీహెచ్‌ఎంసీ మాజీ కమిషనర్ డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, రామచంద్రన్, నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం సీజీఎం ఉదయభాస్కర్, జాతీయ పోషకాహార సంస్థ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.







పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించిన రోటరీక్లబ్ సమావేశంలో ప్రజాస్వామ్యపీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ పాల్గొన్నారు.

# రైల్వే నియామక బోర్డునూ విశాఖలోనే ఏర్పాటు చేయాలి: భీశెట్టి బాబ్జీ

విశాఖపట్నం కేంద్రంగా రైల్వే నియామక బోర్డు ఏర్పాటుకి కృషి చేయాలని లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుకు గతంలో ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్‌గా ఉన్న కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో లోక్‌సత్తా, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల పోరాటాల ఫలితంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ సాకారమైందన్నారు. 2026 జూన్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. విశాఖకు రావాల్సిన రైల్వే నియామకబోర్డును మరోచోటికి తరలించే ప్రయత్నం తగదన్నారు. రైల్వే జోన్ కేంద్రం ఉన్నచోటే నియామకబోర్డు ఏర్పాటు ఉండేలన్నారు. విశాఖలో ఆర్ఆర్‌బీ ఏర్పాటుకు ఎన్‌డీయే కూటమి ప్రభుత్వంలో భాగమైన జనసేనతోపాటు ఉత్తరాంధ్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలన్నారు. దీనిపై ఆగస్టులో విశాఖలో రౌండ్‌టేబుల్ అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలని లోక్‌సత్తా విశాఖ నగర అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్ మూర్తి, నేతలు గొట్టాపు సుధీర్, వడ్డాది ప్రకాశరావు, చెన్నా వెంకటరావు, ఇప్పలవలస గోపాలరావు తదితరులు విజ్ఞప్తి చేశారు. హోం మంత్రి అనిత, బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు తదితరులకు ఇప్పటికే సమస్య వివరించి మద్దతు కోరామన్నారు.



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035,ఈమెయిల్: mpstexer@gmail.com

## Vote Jugaad 15th August 2026 జుగాడ్ 50:50 రాజనీతి

(Good Governance by Jugaad Bharat United Voters)

## స్వజాతీయ నమూనా మార్పు - Paradigm Shift ఓటర్ల జాతికి అంకితం

1) 25నుండి50 సంవత్సరముల వయస్సుకలిగి, సహజనాయకత్వంతో, గ్రామసర్పంచ్ స్థాయిలో ప్రజాసేవచేయగల నేర్పు కలిగిన స్త్రీ- పురుషులకు (అరమరికలులేని భార్యాభర్తలైతే మరీ మంచిది) జుగాడ్ఓటర్ల స్వయంపరిపాలన ప్రతిపాదన! జుగాడ్ ద్విపక్షపార్టీ -నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం- అనే సంకల్పంతో మనకోసం మరియు మనపిల్లల భవిష్యత్తుకోసం, స్వతంత్రంగా జీవించడానికి పట్టుదలతో ఒక ప్రయత్నం చేద్దాం రండి! అనుకున్నది వినూత్నంగా సాధిద్దాం. ఆర్థిక వికేంద్రీకరణ, అధికార వికేంద్రీకరణల ద్వారా సామాజిక న్యాయంకోసం సామాజిక బాధ్యత వహించి, మనకిమనమే అధినేతలం కావాలి. ఒక MLA నియోజకవర్గంలో కేవలం మూడువేలమంది జుగాడ్ ఓటర్లు చాలు.

2) Jugaad ఓటరుగా నమోదు చేసుకోవాలంటే మంచిమనసుతో, ఒకేసారి రూ. 2,000/ విరాళం ఇస్తే చాలు.
లేదా, మెరుగైన సమాజం కోసం జుగాడ్ కార్యకర్తగా ఒకేసారి రూ. 5,000 కానీ రూ. 10,000 కానీ ఇచ్చి, MLA గా కానీ, MP గా కానీ, మాచేత ఎన్నుకోబడి మంచిపేరు సంపాదించండి.

3) మనకు నచ్చిన విషయాలూ, నచ్చని విషయాల మధ్య స్పష్టత లేకపోవడం వల్ల నిత్యం జరిగే రాజకీయాలే జనసమూహాల మధ్య జరిగే పంచాయతీలు. దానికి తోడుగా ఓటర్లను ఆకర్షించడానికి 1,55,000 వార్తాపత్రికలు, 900 పైగా టీవీ ఛానళ్ల యాజమాన్యాలు తమకు మాత్రమే నచ్చిన విశ్లేషణలతో వ్యాపారం చేస్తున్నాయి. అందుచేత, మనకు రక్షణ కల్పించే విధంగా కనీసం రెండు జాతీయ వార్తా పత్రికలనూ, రెండు అధీకృత టీవీ చానళ్లను వారి భాగస్వామ్యంతో నిర్మించుకోవాలి.

4) నమూనా మార్పులు: 1) సంపాదనపరంగా ప్రభుత్వం-ప్రైవేట్ ఉద్యోగుల మధ్య వివక్షలేని పారదర్శకతతో ఆర్థిక సమానత్వం 2) పొలిటికల్ పార్టీలు సేకరించే విరాళాల మొత్తంలో పార్టీ నిర్వహణ ఖర్చులు పోగా మిగిలిన ఆదాయంపై విధిగా పన్ను చెల్లించాలి. 3) ప్రస్తుతం స్త్రీలపై జరుగుతున్న లైంగిక వేధింపులు అత్యాచారాలు మొదలైన కేసులలో నిర్ణయాత్మకమైన కఠిన చర్యలతో పకడ్బందీగా స్త్రీలే న్యాయమూర్తులుగా వ్యవహరిస్తారు. అలాగే ధూమపానం, మద్యపానం, జూదం, వ్యభిచారం, వరకట్నం, విడాకులు మొదలైన సాంఘిక సంస్కరణల-విధులలో 50% స్త్రీలదే అధికారం.

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

**జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు :** (Rs/-10,000 donors): **Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)(11)KOTIKALAPUDI TARAKESH (12) D.V.S.Rao**

**జుగాడ్ ఓటర్లు : Sarvasri (1) JVL. NARAYANA (Nellore AP) (2) S.D.BABU (Tamilnadu) (3) T.SURYANARAYANA (Vizag AP) (4)Smt.D. SUBHADRA (5) M.RANGA RAO (6) M.SAI SUBBARAO (7) Smt.D.JANAKI (8) J.VENKATA RAO (Vijayawada AP) (9) P.NARASIMHA RAO (10) SAI SURYANARAYANA (Karnataka) (11) MSS KUMAR (12) Dr.U.V.KRISHNA MURTHY (13) M.RAMA RAO (14) NANDAN SRIDHAR (15) Smt.K.RAJESWARI (16) Smt.K.LAKSHMI (17) Justice CHANDRAKUMAR (18) K. VASUDEVA RAO (19) NARAGONI (20) D.KONDALA RAO (21) M.S. Narayana Rao (22) Sriram (Amalapuram AP) (23) P.Sunil (Bhimavaram AP) (24) Amaranath (25) B.Poorna Kumar Das (26) KHS Sarma (27) Metta Ramarao (Vizag, AP) (28) IR Rao (29) S Madhavarao (30) DRK Rao (31) Smt.P Amulya (32) pallela Devaraju (33) YSN MURTY (Kakinada, AP) (34) DV KOTESWARA RAO (35) Santosh Eeraveni (36)Somanchi Radhakrishna 37) C.V. Ratnam 38) Smt Jayanti Vijaya 39) Vishnubhotla Venugopal 40)Er.P.Narasingarao 41) CA Srinivasan**

advt

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th Aug 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001

**BE A PART OF THE SOLUTIONS**
SCAN FOR YOUR BETTER DEVELOPMENT & FUTURE



www.fdrindia.org
www.youtube.com/@JPLoksattaOfficial
www.instagram.com/jploksatta
www.youtube.com/@byFDR
www.instagram.com/fdrindia
www.x.com/JP_LOKSATTA

## FDR విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్ ప్రారంభ దృశ్యాలు



*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.
Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.